

ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 09-09-2025 | సంపుటి - 25 | సంచిక - 119 | రూ : 4 | పేజీలు:

# అడ్డుకున్నా ఆగం... అభివృద్ధిని ఆపం

- రాబోయే వందేళ్లలో రాష్ట్ర ప్రగతికి కార్యాచరణ
- తెలంగాణ విజన్-2047 డాక్యుమెంట్ డిసెంబరు 9న జాతికి అంకితం
- తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి తీరుతాం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలింపు ప్రాజెక్టు ఫేజ్- 2, 3లకు శంకుస్థాపన




హైదరాబాద్: ఎవరు అడ్డం పడినా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా అధిగమించుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు రాకూడదనే ఉద్దేశంతో కడుపులో విషం పెట్టుకుని ప్రాజెక్టులను ఆపొద్దని కోరారు. 'రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అద్భుతమైన, గొప్ప నగరంగా తీర్చిదిద్దుకుందాం. మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ఆర్ నిర్మాణం వంటి ప్రాజెక్టులతో మెట్రో నగరాన్ని విస్తరించుకుందాం' అంటూ పిలుపునిచ్చారు. రాబోయే వందేళ్లలో హైదరాబాద్‌తో పాటు రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలో కార్యాచరణ రూపొందిస్తున్నామని, అంతా కలసిరావాలని కోరారు. అభివృద్ధిని అడ్డుకునేందుకు ఎన్ని కుట్రలు,

తరువాయి 2లో



## కొనుగోలు కేంద్రాల్లో దళారులకు అడ్డుకట్ట

- పంట పండించిన రైతులకే ప్రవేశం
- ఆధార్ కార్డు సమర్పించాలి
- పోస్ యంత్రాల ద్వారా ధ్రువీకరణ
- రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు
- నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్

హైదరాబాద్: రాష్ట్రంలో మార్క్‌ఫెడ్, ఇతర ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో దళారులను అనుమతించరు. పంట పండించిన రైతులు మాత్రమే తమ ఉత్పత్తులను తెచ్చి విక్రయించాలి. తప్పనిసరిగా వారు ఆధార్‌కార్డు కలిగి ఉండాలి. ధ్రువీకరణ కోసం కొనుగోలు కేంద్రాల్లో ఇ పోస్(ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాలతో ధ్రువీకరణ అనంతరమే వారి నుంచి పంట తీసుకుంటారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో పెసలు, కందులు, జొన్నలు, సోయా, పొద్దుతిరుగుడు వంటి పంటలకు సరైన ధరలు రానప్పుడు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా వాటిని మద్దతు ధరకు కొంటోంది. ఈ కేంద్రాలకు దళారుల బెడద ఎక్కువైంది. రైతుల

తరువాయి 2లో



2లో

## 70కి పైగా బీసీ కుల సంఘాల నేతలతో కవిత భేటీ

- బీసీ హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన కవిత
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను విస్మరించారని ఆరోపణ
- 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఉద్యమ కార్యాచరణ

## భారత్‌కు ఎదురుందా!




2లో

## బీజేపీ తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించిన అధిష్ఠానం

2లో

## మూసీ ప్రక్షాళన ద్వారా తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది

- ఉస్మాన్ సాగర్ వద్ద గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన
- నగర ప్రజల దాహార్తి తీర్చడానికే ఈ పథకం తీసుకువచ్చామన్న ముఖ్యమంత్రి
- సమస్యలు సృష్టించినా సమన్వయంతో ముందుకు వెళతామని వ్యాఖ్య



2లో




2లో

## జీ20 దేశాల్లో భారత్‌దే రికార్డ్..

- జీ20 దేశాల్లోనే అత్యల్పంగా భారత్‌లో నిరుద్యోగ రేటు
- కేవలం 2 శాతంగా ఉందని వెల్లడించిన కేంద్ర మంత్రి మాండవీయ

## భారత్‌ను చూసి నేర్చుకోండి..

### మోదీ పాలసీపై ఇజ్రాయెల్ నిపుణుడి ప్రశంసలు

- 'దేశ గౌరవం'ను వ్యూహాత్మక ఆస్తిగా మార్చుకోవడంలో మోదీ విజయం సాధించారన్న జకి షలోమ్
- ట్రంప్ ఫోన్ కాల్స్‌ను కూడా తిరస్కరించిన మోదీ వైఖరిపై ప్రశంసలు
- ఇజ్రాయెల్ స్పందన గందరగోళంగా ఉంటోందని నిపుణుడి విమర్శ

2లో






## ఏపీలో 11 మంది ఐఏఎస్‌ల బదిలీ...

- టీటీడీకి కొత్త ఈవో
- రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ లకు స్థానచలనం
- టీటీడీ నూతన ఈవోగా అనిల్ కుమార్ సింఘాల్ నియామకం
- ప్రస్తుత ఈవో శ్యామలరావు జీఏడీ ముఖ్య కార్యదర్శిగా బదిలీ
- రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్య కృష్ణబాబు

2లో

## ఉప రాష్ట్రపతి ఎన్నికలు... బీఆర్ఎస్ బాటలో మరో పార్టీ

- ఉపరాష్ట్రపతి ఎన్నిక ఓటింగ్‌కు దూరంగా ఉండాలని బీజేడీ నిర్ణయం
- ఎన్డీయే, ఇండియా కూటములకు సమదూరం పాటించాలన్నదే తమ విధానమని వెల్లడి
- ఇప్పటికే ఈ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్టు ప్రకటించిన బీఆర్ఎస్

2లో



# ఏపీలో 11 మంది ఐఏఎస్‌ల బదిలీ... టీటీడీకి కొత్త ఈవో

* **రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ లకు స్థానచలనం**
* **టీటీడీ నూతన ఈవోగా అనిల్ కుమార్ సింఘాల్ నియామకం**
* **ప్రస్తుత ఈవో శ్యామలరావు జీఏడీ ముఖ్య కార్యదర్శిగా బదిలీ**
* **రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కృష్ణబాబు**
* **పనితీరు ఆధారంగా బదిలీలు చేపట్టిన ప్రభుత్వం**
* **పలువురు అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగింత**

**అమరావతి, సెప్టెంబర్ 08 :** ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలన యంత్రాంగంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 11 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ బదిలీలు జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవోగా సీనియర్ అధికారి అనిల్ కుమార్ సింఘాల్‌ను నియమించారు. ప్రస్తుతం టీటీడీ ఈవోగా పనిచేస్తున్న శ్యామలరావును సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేశారు. రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కృష్ణబాబును నియమించారు. రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ముఖేశ్ కుమార్ మీనా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సీహెచ్ శ్రీధర్, అటవీ పర్యావరణ శాఖ కార్యదర్శిగా కాంతిలాల్ దండే బాధ్యతలు చేపట్టనున్నారు. ఇతర ముఖ్య నియామకాల్లో భాగంగా, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అనంతరామ్‌ను,




కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సౌరభ్ గౌర్‌ను ప్రభుత్వం నియమించింది. ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రవీణ్ కుమార్, పరిశ్రమలు, కార్మిక శాఖ కమిషనర్‌గా శేషగిరిబాబును నియమించారు. ఎండోమెంట్ రెవెన్యూ కార్యదర్శిగా హరి జవహర్‌లాల్‌కు బాధ్యతలు అప్పగించారు. గత కొద్ది రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఐఏఎస్ అధికారుల పనితీరుపై సమీక్షలు జరిపారు. పరిపాలనలో వేగం పెంచేందుకు, అధికారుల పనితీరును మెరుగుపరిచేందుకు ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. పనితీరును ప్రామాణికంగా తీసుకుని, సమర్థులైన అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించాలనే లక్ష్యంతో ఈ బదిలీలు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## బీజేపీ తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించిన అధిష్ఠానం

* **ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, 8 మంది రాష్ట్ర ఉపాధ్యక్షులతో కమిటీ ఏర్పాటు**
* **రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా గౌతంరావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్**
* **ఉపాధ్యక్షులుగా బూర నర్సయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 :** బీజేపీ అధిష్ఠానం తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించింది. ఈ కమిటీలో ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, ఎనిమిది మంది రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉంటారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా గౌతంరావు, తూళ్ల వీరేందర్ గౌడ్, వేముల అశోక్‌లను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బూర నర్సయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు, బండారి శాంతి కుమార్, కొల్లి మాధవి, జయశ్రీ, బండా కార్తీక్ రెడ్డి, రఘునాథ్ రావు, కల్యాణ్ నాయక్‌లను నియమించినట్లు ఆయన వెల్లడించారు. అంతేకాకుండా, వివిధ మోర్చాలకు రాష్ట్ర అధ్యక్షులను కూడా నియమించారు.

## మూసీ ప్రక్షాళన ద్వారా హైదరాబాద్ తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 :** మూసీ ప్రక్షాళన ద్వారా హైదరాబాద్ నగర ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమవడంతో పాటు, నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య కూడా తీరుతుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమంలో భాగంగా ఉస్మాన్ సాగర్ వద్ద చేపట్టిన గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టు పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ నగర దాహార్తిని తీర్చడానికే గోదావరి తాగునీటి పథకాన్ని తీసుకువచ్చామని తెలిపారు. వరద నియంత్రణ కోసమే ఉస్మాన్ సాగర్, హిమయత్ సాగర్ జంట జలాశయాలను నిర్మించారని ఆయన గుర్తుచేశారు. తాగునీటి సమస్యల పరిష్కారం కోసం పీజేఆర్ ఎన్నో పోరాటాలు చేశారని ఆయన స్మరించుకున్నారు. రూ. 7,360 కోట్లతో హ్యామ్ విధానంలో ఈ పనులు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నల్గొండ జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు మూసీ నదిని ప్రక్షాళన చేయాలని ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. సమస్యలు ఎదురైనా సమన్వయంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని ఆయన పేర్కొన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఈ పథకాన్ని పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగకూడదో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. త్వరలోనే మహారాష్ట్రకు వెళ్లి అక్కడి ముఖ్యమంత్రిని కలుస్తానని తెలిపారు.

## ఉప రాష్ట్రపతి ఎన్నికలు... బీఆర్ఎస్ బాటలో మరో పార్టీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 :** ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్‌కు దూరంగా ఉండాలని ఒడిశాకు చెందిన కీలక ప్రాంతీయ పార్టీ బిజూ జనతాదళ్ (బీజేడీ) నిర్ణయించింది. బీఆర్ఎస్ ఇప్పటికే ఇదే వైఖరిని ప్రకటించగా, తాజాగా బీజేడీ కూడా ఆ జాబితాలో చేరింది. రేపు జరగనున్న ఓటింగ్‌లో తమ పార్టీ ఎంపీలు పాల్గొనబోరని బీజేడీ రాజ్యసభ సభ్యుడు సస్మిత్ పాత్రా ఢిల్లీలో వెల్లడించారు. ఈ అంశంపై పార్టీ ఎంపీలు, రాజకీయ వ్యవహారాల కమిటీతో చర్చించిన అనంతరం బీజేడీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ తుది నిర్ణయం తీసుకున్నారని సస్మిత్ పాత్రా తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి, కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమికి సమాన దూరం పాటించాలన్న తమ పార్టీ విధానానికి అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. తమ పూర్తి దృష్టి ఒడిశా రాష్ట్ర అభివృద్ధి, 4.5 కోట్ల మంది ప్రజల సంక్షేమంపైనే కేంద్రీకృతమై ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాజ్యసభలో బిజూ జనతాదళ్‌కు ఏడుగురు సభ్యుల బలం ఉంది. రేపు జరగనున్న ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా తెలంగాణకు చెందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి బరిలో ఉన్నారు. రెండు కూటములకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో రెండు ముఖ్యమైన ప్రాంతీయ పార్టీలు ఈ ఎన్నిక ప్రక్రియకు దూరంగా ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## జీ20 దేశాల్లో భారత్‌దే రికార్డ్.. నిరుద్యోగ రేటు కేవలం 2 శాతమే

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 :** భారతదేశం ఉద్యోగ కల్పనలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని, ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలైన జీ20 దేశాలతో పోలిస్తే మన దేశంలోనే నిరుద్యోగ రేటు అత్యల్పంగా ఉందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్) విడుదల చేసిన 'ది ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్ 2025' ప్రకారం భారతదేశంలో నిరుద్యోగ రేటు కేవలం 2 శాతంగా నమోదైందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాండవీయ ప్రసంగించారు. దేశ ఆర్థిక వృద్ధికి అనుగుణంగా అన్ని రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయని, ప్రభుత్వ పథకాలు ఇందుకు ఎంతగానో దోహదపడ్డాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ కెరీర్ సర్వీస్ (ఎన్సీఎస్) పోర్టల్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు 'మెంటర్ టుగెదర్', 'క్వికర్' సంస్థలతో కార్మిక మంత్రిత్వ శాఖ అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకుంది. ప్రస్తుతం ఎన్సీఎస్ పోర్టల్‌లో దాదాపు 52 లక్షల కంపెనీలు, 5.79 కోట్ల మంది ఉద్యోగార్థులు రిజిస్టర్ చేసుకున్నారని మంత్రి వివరించారు. ఈ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 7.22 కోట్ల ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకువచ్చామని, ప్రస్తుతం 44 లక్షలకు పైగా ఉద్యోగాలు యాక్టివ్‌గా ఉన్నాయని ఆయన తెలిపారు. ఉద్యోగ సమాచారం అందించడమే కాకుండా ఉపాధికి సంబంధించిన అన్ని సేవలకు దీనిని ఒకే వేదికగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు పెద్దపీట వేసిందని మాండవీయ గుర్తుచేశారు. యువతలో నైపుణ్యం, ఉపాధి కోసం రూ. 2 లక్షల కోట్ల బడ్జెట్‌తో ఐదు ప్రధాన పథకాలను ప్రకటించిందని తెలిపారు. ఇందులో భాగంగా, రూ. 99,446 కోట్ల కేటాయింపులతో ప్రారంభించిన 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' (పీఎం వీబీఆర్‌వై) ద్వారా రాబోయే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాలు సృష్టించడం లక్ష్యమని పేర్కొన్నారు. వీరిలో 1.92 కోట్ల మంది తొలిసారిగా ఉద్యోగాల్లో చేరే యువత ఉంటారని అన్నారు. కొత్తగా కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా ఉద్యోగార్థులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. 'మెంటర్ టుగెదర్' భాగస్వామ్యంతో మొదటి ఏడాదిలోనే 2 లక్షల మంది యువతకు వ్యక్తిగత కెరీర్ మార్గదర్శకత్వం అందించనున్నారు. ఇక 'క్వికర్' ఒప్పందం ద్వారా దేశవ్యాప్తంగా 1,200 నగరాల నుంచి రోజూ 1,200కు పైగా ఉద్యోగ ప్రకటనలను ఎన్సీఎస్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఇది గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

## 70కి పైగా బీసీ కుల సంఘాల నేతలతో కవిత భేటీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 08 :** బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని, ఇందుకోసం ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 70కి పైగా బీసీ కుల సంఘాల నాయకులతో ఈరోజు ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పటివరకు పార్లమెంటులో ఎందుకు ప్రస్తావించలేదో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆమె దుయ్యబట్టారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలోగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించాలని కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని బీసీ సంఘాలను కలుపుకొని, రిజర్వేషన్ల సాధన కోసం ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగుతామని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరే వరకు తమ పోరాటం ఆగదని ఆమె తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు ప్రధానంగా చర్చించారు.

## భారత్‌ను చూసి నేర్చుకోండి.. మోదీ పాలసీపై ఇజ్రాయెల్ నిపుణుడి ప్రశంసలు

**ఇజ్రాయెల్, సెప్టెంబర్ 08 :** అంతర్జాతీయ సంబంధాల్లో 'దేశ గౌరవాన్ని' ఒక వ్యూహాత్మక ఆస్తిగా ఎలా కాపాడుకోవాలో భారత్ నుంచి ఇజ్రాయెల్ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆ దేశానికి చెందిన ప్రముఖ రక్షణ రంగ నిపుణుడు జకి షలోమ్ అభిప్రాయపడ్డారు. మిస్‌గవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ సెక్యూరిటీలో సీనియర్ ఫెలోగా పనిచేస్తున్న ఆయన, 'జెరూసలెం పోస్ట్'కు రాసిన ఒక వ్యాసంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానాన్ని కొనియాడారు. పాకిస్థాన్‌తో ఘర్షణలు, అమెరికా విధించిన టారిఫ్‌ల వంటి క్లిష్ట సమయాల్లో ప్రధాని మోదీ దృఢమైన వైఖరిని ప్రదర్శించారని షలోమ్ గుర్తుచేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను కూడా మాట్లాడేందుకు నిరాకరించడం ద్వారా, తన దేశ గౌరవానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారనే బలమైన సందేశాన్ని మోదీ పంపారని ఆయన వివరించారు. "దేశ గౌరవం అనేది కేవలం విలాసవంతమైన విషయం కాదు, అదొక కీలకమైన వ్యూహాత్మక ఆస్తి. మోదీ చర్యలు కఠినంగా అనిపించినా, భారత్‌ను తక్కువగా చూడటాన్ని అంగీకరించబోమని ఆయన స్పష్టం చేశారు" అని షలోమ్ తన వ్యాసంలో పేర్కొన్నారు. మరోవైపు, ఖాన్ యూనిస్‌లోని నాస్సెర్ ఆసుపత్రిపై దాడి విషయంలో ఇజ్రాయెల్ వైఖరి గందరగోళంగా, ఆత్రుతతో కూడుకున్నదిగా ఉందని ఆయన విమర్శించారు. ఇజ్రాయెల్ స్పందన కారణంగా అమాయకులను చంపామన్న సంకేతాలు ప్రపంచానికి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దాడిలో 20 మంది ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ ప్రదర్శిస్తున్న నిబద్ధత, స్పష్టత ఇజ్రాయెల్‌కు ఆదర్శం కావాలని షలోమ్ సూచించారు.

## అడ్డుకున్నా ఆగం... అభివృద్ధిని ఆపం

(మొదటిపేజీ తరువాయి)

కుతంత్రాలు చేసినా... కాంగ్రెస్ ప్రభుత్వం తిప్పికొడుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్2047 విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబరు 9న జాతికి అంకితం చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. హైదరాబాద్ సమీపంలోని రంగారెడ్డి జిల్లా గండిపేట వద్ద చేపట్టిన రూ.7,360 కోట్లతో హైదరాబాద్ నగరానికి 20 టీఎంసీల గోదావరి జలాల తరలింపు ప్రాజెక్టు ఫేజ్ 2, 3లకు ముఖ్యమంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. జలమండలి ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన 16 తాగునీటి రిజర్వాయర్లను ప్రారంభించారు. గోదావరి ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరించారు. నీటి తరలింపుపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ని తిలకించారు. అనంతరం సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ''తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున ప్రాజెక్టు నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నాం. 148 మీటర్ల ఎత్తు కట్టేందుకు మహారాష్ట్ర ఇప్పటికే అంగీకరించింది. మధ్యేమార్గంగా 149 లేదా 150 మీటర్ల ఎత్తు కట్టి... ఆదిలాబాద్ జిల్లాలోని లక్షన్నర ఎకరాలకు నీరందిస్తాం. ఇందుకోసం మహారాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడుతున్నాం. త్వరలోనే భేటీ అవుతాం. మల్లన్నసాగర్ నుంచి మెదక్ జిల్లాకు మళ్లించిన నీటిని చేవెళ్ల, వికారాబాద్ తాండూరు, పరిగితో పాటు కొంత కొడంగల్ ప్రాంతానికి కూడా తరలించి రైతులను ఆదుకుంటాం.

* **హైదరాబాద్ దాహార్తి తీర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదే**

హైదరాబాద్ మహానగర దాహార్తిని తీర్చేలా ప్రాజెక్టులు చేపట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదే. 1965లో మంజీరా నీటిని కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకొచ్చింది. 2002లో అప్పటి ప్రభుత్వం కృష్ణా జలాలను తీసుకొచ్చేందుకు ప్రయత్నించింది.

## కొనుగోలు కేంద్రాల్లో దళారులకు అడ్డుకట్ట

(మొదటిపేజీ తరువాయి)

వద్ద తక్కువ ధరకు పంట కొన్న వ్యాపారులు.. కొనుగోలు కేంద్రాలకు వచ్చి ఎక్కువకు విక్రయిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. వీరికి అడ్డుకట్ట వేసేందుకు అన్ని రాష్ట్రాల్లో ఆధార్ కార్డుల నమోదు ఆధారిత కొనుగోళ్ల విధానం చేపట్టాలని, దీనికోసం నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఇటీవల లేఖ రాసింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమిస్తూ కొత్త విధానంపై ఉత్తర్వులు జారీ చేసింది.

**నూతన విధానం ఇలా..**

ప్రతి కొనుగోలు కేంద్రంలో ఇపోస్ యంత్రం ఏర్పాటు చేస్తారు. వాటిలో రాష్ట్రంలో రైతులందరి భూముల సర్వే నంబర్లు, పంటల సమాచారం (వ్యవసాయశాఖ పంట నమోదు) ద్వారా అనుసంధానం చేస్తారు. రైతులు తమ పంట ఉత్పత్తులతో ఆయా కేంద్రాలకు వచ్చినప్పుడు ముందుగా ఆధార్‌కార్డుతో ఇపోస్‌లో నమోదు చేసుకోవాలి. అందులో రైతు సాగు చేసిన పంట వివరాలను, తెచ్చిన పంట సరిచూసి.. తర్వాత కొనుగోళ్లకు అనుమతిస్తారు. ఇపోస్ యంత్రంలో రైతు భూమి, పంటల వివరాలున్నా.. ఆధార్‌కార్డు లేకపోయినా, పేరు, ఇతర వివరాల్లో తప్పులున్నా.. జాయింట్ కలెక్టర్ వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకొని ఆ పత్రాన్ని తెచ్చి సమర్పిస్తే పంటను కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం ధాన్యం, పత్తేతర కొనుగోలు కేంద్రాలకే పరిమితం చేశారు. త్వరలో పౌరసరఫరాలశాఖ, సీసీఐల ద్వారా జరిగే వరి, పత్తి కేంద్రాల్లోనూ అమలు చేయనున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా కొత్త విధానం అమలుకు మార్క్‌ఫెడ్ సిద్ధమైంది. తమ పరిధిలోని అన్ని కొనుగోలు కేంద్రాలు, సహకార సంఘాల్లో వెంటనే ఇపోస్ యంత్రాలను కొనుగోలు చేయాలని సంస్థ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రంలో త్వరలో పెసలు కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. 58,728 ఎకరాల్లో పెసర పంట వేయగా.. 16,326 క్వింటాళ్ల దిగుబడిని అంచనా వేస్తున్నారు. దీంతో ఖమ్మం, సంగారెడ్డి, వికారాబాద్ తదితర జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు.

## భారత్‌కు ఎదురుందా!

ఆసియా కప్‌లో టీమ్‌ఇండియా తిరుగులేని ఫేవరెట్ అంటే చిన్న మాటే. సూర్యకుమార్ బృందానికి మిగతా జట్లకు అంత తేడా ఉంది. ఆ జట్టు కప్పు అందుకోలేకపోతే ఆశ్చర్యమే. మంగళవారం టోర్నీ తొలి మ్యాచ్‌లో అబుదాబిలో అఫ్గానిస్థాన్, హాంకాంగ్ తలపడతాయి. కానీ కళ్లన్నీ దుబాయ్‌పైనే. ఎందుకంటే అక్కడ యూఏఈతో పోరుతో టీమ్‌ఇండియా తన టైటిల్ వేటను ఆరంభిస్తుంది. ప్రతిభావంతులతో బలంగా కనిపిస్తోన్న భారత్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. టీమ్‌ఇండియా ఎంత ఆత్మవిశ్వాసంతో ఉంది అంటే.. టోర్నీకి 17 మంది సభ్యులను ఎంపిక చేసే అవకాశమున్నా, అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ 15 మందినే ఎంపిక చేసింది. నాలుగున్నర నెలల్లో సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్‌నకు ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ఆసియాకప్ గెలవలేకపోతే విమర్శలు తప్పవు.

# కలిసికట్టుగా ఎదగడం, నమ్మకమే జీవీబీఎల్ బలం

*** నిధి చాప్టర్ కాఫీ మీట్ లో వ్యాపారవేత్తలు..**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : వ్యాపారవేత్తలు అంతా కలిసికట్టుగా ఎదగడం, నమ్మకమే జీవీబీఎల్ బలమని టైటాన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ జిల్లా ప్రసాద్, జనరల్ సెక్రటరీ రవి కొండూరి, ట్రెజరర్ తరుణ్ చింత, వైస్ ప్రెసిడెంట్స్ తాడిశెట్టి క్రాంతి కుమార్, బజ్జూరి సంతోష్ కుమార్, ఎగ్జిక్యూటివ్స్ మెంబెర్ కృష్ణ మోహన్ గుప్తా అన్నారు. జీవీబీఎల్ నల్గొండ - నిధి చాప్టర్ కాఫీ మీట్ 40 మంది ప్రతిభావంతులైన వ్యాపారవేత్తలతో అద్భుతమైన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవీబీఎల్ బలం కలసికట్టుగా ఎదగడం మరియు నమ్మకమని, నల్గొండ వ్యాపారవేత్తలు ఒకే వేదికపై చేరడం ఎంతో సంతోషకరమన్నారు. రాబోయే రోజుల్లో ఈ చాప్టర్ మరింత బలపడుతుందని మాకు విశ్వాసం, నమ్మకం ఉందన్నారు. జీవీబీఎల్ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీమాంచి రాజశేఖర్ సంస్థ స్థాపించారని పేర్కొన్నారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బిజినెస్ నెట్‌వర్కింగ్ వేదిక గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్ (జివిబీఎల్) ఆధ్వర్యంలో నల్గొండ - నిధి చాప్టర్ సభ్యులు కాఫీ మీట్ లో ఉత్సాహంగా కలుసుకున్నారు. ఈ సమావేశంలో 40 మంది ప్రతిభాశాలి వ్యాపారవేత్తలు పాల్గొని తమ వ్యాపార పరిచయాలు చేసుకున్నారు. వ్యాపారాభివృద్ధి కోసం పరస్పర సహకారం, నెట్‌వర్కింగ్ పై చర్చలు జరిగాయన్నారు. అనంతరం నిధి



చాప్టర్ కొత్త హెడ్ టేబుల్ ప్రకటించారు. చైర్మన్ గా పారేపల్లి శ్రీనివాస్, వైస్ చైర్మన్లు వెంకటేశ్వర్లు, రవి కుమార్ లను ఎన్నుకున్నారు. కాఫీ మీట్ ముగింపులో సభ్యులు జీవీబీఎల్ నల్గొండ - నిధి చాప్టర్ ను విజయవంతమైన వ్యాపార, సేవా వేదికగా తీర్చిదిద్దేందుకు కృతనిశ్చయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. మీట్ లో బోనగిరి ప్రభాకర్, గట్టు వెంకన్న, నాంపల్లి మనోహర్, వనమా దామోదర్, గార్లపాటి చంద్రశేఖర్, బండారు హరినాథ్, దోసపాటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు శుభాకాంక్షలు



మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన సంవత్సరం విజయవంతంగా పూర్తైన సందర్భంగా సోమవారం వారి నివాసంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ , ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి , రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షుని బాధ్యతలు చేపట్టిన నాటి నుండి కాంగ్రెస్ పార్టీని పునర్నిర్మించేందుకు క్రియాశీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ,పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. రానున్న కాలంలో పార్టీని గ్రామ స్థాయిలో బలపరిచేందుకు బొమ్మ మహేష్ కుమార్ తీసుకుంటున్న చర్యలు మరింత ప్రభావవంతంగా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆయన రూటే ప్రత్యేకం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారిగా ఇటీవలే పదవీ విరమణ చేసిన డాక్టర్ ప్రభు దయాల్ తన ప్రతి అడుగులోనూ సామాజిక స్పృహతో ప్రత్యేకతను చూపిస్తున్నారు.

హంగు ఆర్భాటాలకు దూరంగా.. సేవలో ముందంజలో

తన పదవీ విరమణ (31082025)ను ఎలాంటి సంబరాలు, వేడుకలు లేకుండా, దానికి బదులుగా అవసరంలో ఉన్నవారికి తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో జరుపుకున్నారు. తన స్వస్థలమైన ఇల్లందులో ఒక బీద విధవరాల గృహ నిర్మాణానికి తన వంతు సహాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. తాజాగా ఆయన ఇల్లందుకు చేరుకుని గృహ నిర్మాణ పురోగతిని పరిశీలించారు. ఆ మహిళకు నూతన వస్త్రాలు బహూకరించగా, పదవ తరగతి చదువుతున్న ఆమె కుమారునికి పూర్తి స్టడీ మెటీరియల్ అందజేశారు. “బాగా చదివి తల్లి కలలను నెరవేర్చాలి” అని ప్రోత్సహించారు.

**చదువే శాశ్వత సంపద**

“తాను చిన్నతనంలో ఇల్లందులో ఎదుర్కొన్న అనుభవాలే సేవా భావానికి ప్రేరణగా మారాయి. చదువు మన తలరాతను మార్చగల శక్తి. చదువుకి మించిన సంపద మరొకటి లేదు” అని ప్రభు దయాల్ అన్నారు. విద్యార్థులకు చదువులో ఏ అవసరమైనా తాను ఎల్లప్పుడూ సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.

**వృత్తి నుంచే సేవా మార్గం**

ఉపాధ్యాయ వృత్తిలో చేరిన నాటి నుండి ఆయన అనేకమంది విద్యార్థులకు ఆసరాగా, భరోసాగా నిలిచారు. పలువురు ఆయన స్ఫూర్తితో ఉన్నత విద్యను పూర్తిచేసి జిల్లా స్థాయి అధికారులుగా కీర్తి పొందారు. తన వేతనం నుండి కొంత భాగాన్ని నిరంతరం సామాజిక సేవకే వినియోగించడం ఆయన ప్రత్యేకత. “అవసరంలో ఉన్నవారికి సహాయం చేస్తే లభించే ఆనందం అమూల్యం” అని ఆయన భావోద్వేగంగా చెబుతారు. ఈ మార్గంలో ఆయనకు కుటుంబ సభ్యుల సంపూర్ణ సహకారం ఉండటం సంతోషకరం అంటారు.

**ఆదర్శం అయిన ఇల్లందు ముద్దుబిడ్డ**

తనకు సాధ్యమైన రీతిలో ఇలాగే కొనసాగుతానని డాక్టర్ ప్రభు దయాల్ చెబుతూ, ఇల్లందు ముద్దుబిడ్డగా అందరి హృదయాలను గెలుచుకుంటున్నారు.



## ఏటీసీ ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకొని తమ భవిష్యత్తును బలోపేతం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు.సోమవారం ఆయన మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల, ఏటీసీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఏటీసీ భవన సముదాయాన్ని పరిశీలించారు. ఐటీఐలను ఆధునీకరించే క్రమంలో ఏటీసీలు ఏర్పాటు చేశామని, వీటిలో శిక్షణ పొందిన విద్యార్థులకు పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. ఏటీసీ శిక్షణ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. శిక్షణ కాలంలో విద్యార్థులు కష్టపడి చదివి సంపూర్ణ నైపుణ్యాన్ని సాధించాలని సూచించారు. కావలసిన పుస్తకాలను ఉచితంగా అందజేస్తామని, ఐటీఐలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన పరికరాలపై ప్రణాళికలు రూపొందించి నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. తరువాత కలెక్టర్ మణుగూరు తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ 11వ ఎన్‌సిసి ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సిసి క్యాంపును సందర్శించారు. ఈ క్యాంపు 17వ తేదీ వరకు పది రోజుల పాటు కొనసాగనుందని, 700 మంది విద్యార్థులు



పాల్గొంటున్నారని తెలిపారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ సంజయ్ కుమార్ భద్ర, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ నవీన్ యాదవ్‌లతో శిక్షణ, ఉద్యోగ అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. క్యాంపు సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. క్యాంప్‌లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ ఎన్సిసి శిక్షణ ద్వారా క్రమశిక్షణ, నాయకత్వం, దేశసేవ విలువలు పెరుగుతాయి అన్నారు. జిల్లాలో రథంగుట్ట వంటి సహజ సౌందర్య ప్రదేశాలను ఎన్సిసి అడ్వెంచర్ క్యాంపులకు వినియోగించుకోవచ్చని, దీని ద్వారా పర్యాటక రంగానికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఐటీఐ సూపరింటెండెంట్ జ్యోతిరాణి, ఏటీవోలు జీ.వి. కృష్ణారావు, వేణుగోపాల్, ఏటీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు...

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు పట్టణంలోని ఆంబజార్ లో గల 17, 18 వార్డుల నెహ్రూ చౌక్ సెంటర్లో సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే స్వయంగా హాజరై కేక్ కట్ చేశారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, వ్యాపారులు నాపై చూపుతున్న ప్రేమాభిమానాలు నాకు మరింత సేవా తపనను పెంచుతున్నాయన్నారు. ఈ వేడుకలు నా జీవితంలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్వహస్తాలతో 50 మంది పేద మహిళా సోదరీమణులకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం నాయకులు ఆయనను శాలువాలతో ఘనంగా సత్కరించారు.వేడుకల వేదిక ఆనందోత్సాహాలతో, శుభాకాంక్షలతో కిక్కిరిసిపోయింది. ప్రజల మధ్య ఎల్లప్పుడూ నిలిచి నియోజవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడిగా కోరం కనకయ్యను స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, కోరం సురేందర్,



చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, మండల రాము, శ్రీహరి హర క్షేత్రం దేవాలయం కమిటీ చైర్మన్ గందె సదానందం, పింగళి నరేష్, సింగరేణి మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జుగల్ కిషోర్,ఆర్యవైశ్య సంఘం నాయకులు అర్వపల్లి రాధాకృష్ణ, కండె రమేష్, నరేంద్రుల అను,యెలుగూరి మల్లికార్జున్,తాటిపల్లి సుబ్బారావు, సైఫా రాజశేఖర్, యెలుగూరి మధుబాబు, అయితా శ్రీనివాస్, చందా భద్రం, కుమార్, పుల్లూరు సతీష్, ఆకుల సతీష్, గందే సురేష్, రామిడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణ రెడ్డి కి “బిజినెస్ ఎక్స్ లెన్స్” అవార్డు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : వేముల మండలం కుప్పగుట్ట పల్లి గ్రామానికి చెందిన జి. లక్ష్మీనారాయణ రెడ్డి ( జి ఎల్ ఎన్ రెడ్డి ) బిజినెస్ ఎక్స్ లెన్స్ అవార్డును అందుకున్నారు. సేవా రంగంలో విశేష కృషి కి గాను “న్యూ ప్రీమియర్ టర్బో సర్వీసెస్ సంస్థ టర్బో సర్వీసెస్” కు ఎక్సలెంట్ అవార్డు ను అందించారు. రాజ్ న్యూస్ ఛానల్ ఆధ్వర్యంలో తెలంగాణ లో నిర్వహించిన బిజినెస్ ఎక్స్ లెన్స్ అవార్డును కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా ఆ సంస్థ చైర్మన్ జి. లక్ష్మీనారాయణ రెడ్డి కి అందజేశారు. లక్ష్మి నారాయణ రెడ్డి మొదట్లో టర్బో సర్వీసెస్ లో రూ.1400లకు జీతంతో పనిచేశారని, అప్పటి నుంచి అంచలంచలుగా ఎదిగి 2017 వ సంవత్సరం లో సంస్థలో న్యూ ప్రీమియర్ టర్బో సర్వీసెస్ సంస్థను స్థాపించారన్నారు. కూకట్ పల్లి లో ని కెపిహెచ్బి కాలనీలో కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ స్థాపించిన కొన్ని సంవత్సరాలకే అంచలంచలుగా ఎదిగిందన్నారు. ఈ సంస్థలో 100 కు పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయి సేవలు అందిస్తామని జి. లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు.

## ఘనంగా మాజీ మున్సిపల్ చైర్మన్ స్వర్గీయ బి.లింగం గౌడ్ వర్ధంతి వేడుకలు



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి ) :కుత్బుల్లాపూర్ మాజీ మునిసిపల్ చైర్మన్ స్వర్గీయ బి.లింగం గౌడ్ 11వ వర్ధంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ చౌరస్తా లో గల లింగం గౌడ్ విగ్రహానికి రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ బి. విజయ శేఖర్ గౌడ్ పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం ఆయన ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమం లో రంగారెడ్డినగర్ డివిజన్ సీనియర్ నాయకులు, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు, సీనియర్ నాయకులు, మాజీ వార్డు మెంబర్లు, లింగం గౌడ్ అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

*** సీనియర్ నాయకులు జల్దా రాఘవులు**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి ) : పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ నాయకులు జల్దా రాఘవులు అన్నారు. సోమవారం రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ లోని గాంధీనగర్ సామాజిక భవనం లో స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో కేర్ ఆసుపత్రి, నాంపల్లి వారి సహకారం తో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో గుండె ,షుగర్ కు సంబందించిన పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. డాక్టర్ సీమా పర్యవేక్షణ లో జరిగిన ఈ శిబిరం లో సుమారు 120 మంది పరీక్షలు చేయించుకున్నారని డాక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు జల్దా రాఘవులు పాల్గొని మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖాజా మియా, ఎల్లయ్య, యువజన సంఘం అధ్యక్షులు లక్ష్మి నాథ్, సాయి గౌడ్, శ్రీనివాస్, యాది రెడ్డి, తిమ్మయ్య, నవీన్, దత్తు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీలకు హజరుకావాలని జిల్లా ఎస్పీకి ఆహ్వానం



ప్రజా స్ఫూర్తి , భద్రాద్రి కొత్తగూడెం: ఈనెల 14వ తేదీన కొత్తగూడెం క్లబ్ లో జరగనున్న జిల్లా స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలకు హాజరు కావాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్, పవర్ హౌస్ జిమ్ నిర్వాహకులు షామియుద్దీన్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజును ఆయన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్పీకి పోటీల గురించి వివరించి పోటీల ప్రారంభోత్సవానికి తప్పకుండా హాజరుకావాలని ఆహ్వానించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత పెరిగిందని అందులో భాగంగా జిల్లాలో క్రీడలు,క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశ్యంలో జిల్లా స్థాయి ఎంకరేజ్మెంట్ బెంచ్ ప్రెస్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జెల్లా రాజేష్, కెడం లారెన్స్ లు ఎస్పీ ని కలిసిన వారిలో ఉన్నారు.

# ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఖరారుకు రాజకీయ పార్టీ నాయకులతో జిల్లా కలెక్టర్ సమీక్ష

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వారు జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం రెండవ సాధారణ ఎన్నికలు (ఎంపీటీసీ/జెడ్పీటిసి 2025) నిర్వహణలో భాగంగా, మండల ప్రజా పరిషత్ , జిల్లా ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం ఓటర్ల జాబితా , పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారాల కోసం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కోసం తయారుచేసిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ,పోలింగ్ స్టేషన్లో జాబితాను రాజకీయ పార్టీ నాయకులకు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 471 పంచాయతీలలో మొత్తం 6,69,048 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 3,25,045, మహిళలు 3,43,979 మంది కాగా 24 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. 4168 వార్డులకు గాను 4242 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పకుండా ఓటు హక్కు కల్పించేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారని కలెక్టర్ తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు చేసుకోవడం కోసం ఇప్పుడే దరఖాస్తు చేసుకోవాలని, నోటిఫికేషన్ వెలువడిన తర్వాత కొత్త పేర్లు చేర్పులు ఉండబోవు అని కలెక్టర్




స్పష్టం చేశారు. ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి ఓట్లు బదిలీ చేయడం సాధ్యం కాదని తెలిపారు. ఇప్పటివరకు గుర్తించిన పోలింగ్ కేంద్రాలు యధాతరంగా కొనసాగుతాయని, వాటిలో ఎటువంటి మార్పులు ఉండబోవని ఆయన అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డిప్యూటీ జెడ్పి సీఈవో చంద్రశేఖర్ , ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ బాల ప్రసాద్, భారతీయ రాష్ట్ర సమితి అనుదీప్, సిపిఐ ఎస్ శ్రీనివాస్, సిపిఎం ఏ సత్యనారాయణ, భారతీయ జనతా పార్టీ , నోముల రమేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ఏ. రాంబాబు , తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది గురువులే



పంచశీల పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది గురువులేనని పంచశీల పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మూసాపేటలో గల పంచశీల ఉన్నత పాఠశాల లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు, ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ పాల్గొని ఉపాధ్యాయుల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువు, సమాజ నిర్మాణానికి పునాదిరాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు



ఇల్లందు పట్టణం నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు రక్తదానం

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు నియోజకవర్గం ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకల సందర్భంగా ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ క్యాంప్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 2: వార్డు నుంచి రక్తదానం చేస్తున్న ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ ఉద్యమకారుడు దళితరత్న మేకల శ్యామ్ మాదిగ , తెలంగాణ ఉద్యమకారుడు,ఎస్సీ వర్గీకరణకు ఉద్యమకారుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, నేలమర్రి నాగరాజు మాదిగ, రెండవ వార్డ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తుపాకుల సైదులు, రెండవ వార్డ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండపల్లి సంపత్, రెండవ వార్డ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాసాని ప్రణయ్ తదితరులు ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ డానియల్, ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి జాఫర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లా శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు,

## బాలికలకు హక్కులు, భద్రతా చర్యలపై అవగాహన అవసరం...

- **జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త జి. పల్లవి...**

అందోలు, ప్రజాస్ఫూర్తి : మహిళా, శిశు, వికలాంగుల , వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న పది రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం లో భాగంగా న్యాయపరమైన అవగాహన సదస్సు, మిషన్ పరివర్తన ప్రతిజ్ఞ మరియు మొక్కల నాటే కార్యక్రమం పోతుల బొగుడ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త జి. పల్లవి మాట్లాడుతూ కిశోర వయసు బాలికలు తమ హక్కులు, భద్రతా చర్యలు, విద్య మరియు భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే 1098 బాలల హెల్ప్‌లైన్ మరియు 181 మహిళా హెల్ప్‌లైన్ ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ ఎన్. రంజిత్ కుమార్ మాట్లాడుతూ కిశోర బాలికల విద్య ప్రాముఖ్యతపై దృష్టి సారించారు. చదువుకున్న యువతులు ఉన్నత విద్యావకాశాలు, మంచి ఉద్యోగాలు సాధించి, సమాజ అభివృద్ధికి తోడ్పడతారని పేర్కొన్నారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్వకేట్ లక్ష్మీ మాట్లాడుతూ మహిళలు మరియు యువతులు ఎదుర్కొనే గృహహింస, లైంగిక వేధింపులు, ఆర్థిక ఇబ్బందులు, ఆస్తి వివాదాలు వంటి సమస్యల పరిష్కారానికి సఖి సెంటర్లు బలమైన అండగా




నిలుస్తున్నాయని వివరించారు.అదనంగా, మహిళల రక్షణ కోసం అమలు చేస్తున్న పోస్కో, డీవీ, పోష్ వంటి ముఖ్యమైన చట్టాల గురించి అవగాహన కల్పించి, ఈ చట్టాల ద్వారా యువతులు , మహిళలు తమను తాము రక్షించుకోవచ్చని వివరించారు. సఖి సెంటర్ల ద్వారా అందించే సహాయం మహిళలు భయం లేకుండా, ధైర్యంగా తమ హక్కుల కోసం నిలబడేలా చేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అరుణ, ఎస్ఐ సుధాకర్,ఎస్ఎఫ్ఎల్ నర్సింలు, హెల్త్ సూపర్వైజర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సంగీత, ఏఎన్ఎం లు ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు , విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు బలోపేతానికి విద్యాసంస్థల్లో ఆధునిక సదుపాయాలు...

- **సీఎస్ఆర్ నిధులతో విద్యా రంగానికి మౌలిక సదుపాయాల కల్పన**
- **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ...**

అందోలు, ప్రజాస్ఫూర్తి: విద్యార్థుల భవిష్యత్తు బలోపేతానికి విద్యాసంస్థల్లో ఆధునిక సదుపాయాలు ఉండాలని, అందుకోసం ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. అందోల్ నియోజక వర్గం పర్యటనలో భాగంగా సోమవారం బాలికల పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు . ఈ సందర్భముగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన విద్యతో పాటు ఆరోగ్యవంతమైన వాతావరణంలో అభివృద్ధి చెందడానికి సీఎస్ఆర్ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయి. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలో అన్ని సౌకర్యాలు కల్పించడానికి కట్టుబడి ఉన్నాం అని మంత్రి పేర్కొన్నారు . బాలికల పాలిటెక్నిక్ కాలేజీ లో మైలాన్ అండ్ వైయాట్రిస్ ఫార్మాస్యూటికల్ ఆధ్వర్యంలో, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్రింద విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన లో భాగంగా, కేజీబీవీ పుల్కల్ విద్యార్థులకు రూ. .55,17,507/, అందోల్ లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థులకు రూ. 31, 66, 565/, మోడల్ స్కూల్ మరియు జూనియర్ కాలేజీ బస్వాపూర్ విద్యార్థులకు రూ. 3, 26, 299 , అందోల్ లోని బాలికల పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులకు రూ . 43,



77, 884, కేజీబీవీ అందోల్ విద్యార్థులకు రూ . 14, 34, 012 రూపాయల విలువైన ఆర్ ఓ వాటర్ ప్లాంట్స్ , జిరాక్స్ యంత్రాలు , క్లాస్ రూమ్స్ , లైబ్రరీ , కంప్యూటర్ లాబ్స్ , ప్రిన్సిపాల్ , స్టాఫ్ రూమ్స్ ఫర్నిచర్ (టేబుల్స్ , చైర్స్ ) రెఫ్రిజిరేటర్స్ , మిక్సర్ గ్రైండర్లు , గ్యాస్ స్టవ్స్ , లాప్ టాప్స్ , హెల్త్ కిట్స్ , లాకర్ క్యాబినెట్స్ , కూకర్స్ , స్పోర్ట్స్ కిట్స్ , వాటర్ హీటర్లు , ఫాన్స్ , సీసీ కెమెరాలు , కంప్యూటర్స్ , హాస్టల్స్ బెడ్స్ , ఏసీ లు , లేజర్ ప్రింట్స్ , బెడ్ షీట్స్ , కాట్స్ లాంటి మొదలైన విలువైన , విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను సీఎస్ఆర్ నిధులతో 1 కోటి 48 లక్షల , 22 వేల 767 రూపాయల తో కొనుగోలు చేసిన వస్తువులను మంత్రి దామోదర్ రాజనర్సింహ అందించారు .ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో పాండు, మైలాన్ కంపెనీ ప్రతినిధులు అనీష్ వర్గీస్, మిచెల్ డోమెనిక్ పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

## పోడు సాగుదారులపై దాడులకు స్వస్తి చెప్పాలి

* **సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అనాదిగా పోడు సాగుచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న గిరిజన, గిరిజనేతర పోడురైతులపై అటవీ శాఖ అధికారులు జరుపుతున్న దాడులు, దౌర్జన్యాలను తక్షణమే ఆపాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట బికెఎంయు రాష్ట్ర పిలుపులో భాగంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో వేలాది మంది పోడు రైతులు, వ్యవసాయ కార్మికులు తరలివచ్చారు. గిరిజన హక్కులను హరించవద్దు సాబీర్ పాషా మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత పేదలు పోడు సాగు చేసుకుని పట్టెడు మెతుకులు తింటున్నారు. వారిపై దాడులు చేసి, సాగులో ఉన్న పంటలను ధ్వంసం చేయడం, మొక్కలు నాటుతూ భూములు లాక్కోవడం అన్యాయం. ఇది పేదలపై పాలకులు యుద్ధం ప్రకటించినట్లే. పోడు వ్యవసాయం గిరిజనుల హక్కు. మళ్లీ వారిని దుంపలు తినే స్థితికి తీసుకురావద్దు అన్నారు.పోడు సాగులో ఉన్న ప్రతి ఎకరాకు పోడుపట్టాలు మంజూరు చేయాలి. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన భూములను లాక్కోవడం ఆపాలి.ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రోజుకు రూ.700ల కూలి చెల్లించాలి.సమగ్ర కేంద్ర వ్యవసాయ కార్మిక చట్టం ఏర్పాటు చేయాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు తక్షణమే పరిహారం చెల్లించాలన్నారు. ఇండ్లు లేని పేదలకు పక్కా గృహాలు ఇవ్వాలన్నారు. వలస ఆదివాసీలకు ఎస్టీ ధ్రువపత్రాలు మంజూరు చేసి సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ధర్నా అనంతరం సమస్యలపై వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.ఈ కార్యక్రమానికి వీసంశెట్టి పూర్ణచందర్ రావు, రేసు ఎల్లయ్య అధ్యక్షత వహించగా, నాయకులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, ఎస్ డి సలీం, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, మువ్వా వెంకటేశ్వరరావు, బంధం నాగయ్య, ఎం. యూసుఫ్, పేరాల శ్రీనివాస్, అనంతనేని సురేష్, జి. రామకృష్ణ, సాప్క నాగేశ్వరరావు, సుంకిపాక ధర్మ, విజయ్, కొమరం హన్మంతరావు, బొర్రా కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# కురులు పెరగాలా?

**దృఢమైన, అందంగా మెరిసే కురులు... ప్రతి అమ్మాయి కోరిక. ఒత్తిడి, పోషకలేమి, కాలుష్యం... ఇలా ఎన్నో దీనిమీద ప్రభావం చూపిస్తుంటాయి. కురులు రాలడానికి కారణమవుతాయి. తగ్గించుకోవడానికి భిన్న నూనెలు, సీరమ్‌లు, షాంపూలంటూ ఎన్నో ప్రయత్నిస్తుంటాం. మరి ఈ విటమిన్లూ సరిగా అందిస్తున్నారో లేదో గమనించుకున్నారా?**

హెయిర్ గ్రోత్ సప్లిమెంట్ అని గూగుల్ చేసి చూడండి... 'బయోటిన్' అన్న పేరు తప్పక కనిపిస్తుంది. ఇది కెరటిన్ అనే ప్రొటీన్ ఉత్పత్తికి తద్వారా కురుల పెరుగుదలకీ సాయపడుతుంది. చర్మం, గోళ్ల ఆరోగ్యానికీ ఇది కీలకమే. జుట్టు గడ్డిలా మారడం, చిట్లడం వంటివి బయోటిన్ లోపానికి చిహ్నాలే. కాబట్టి, గుడ్లు, నట్స్, చిలగడదుంప వంటివి ఎక్కువగా తీసుకోండి. ఇది పుష్కలంగా అందుతుంది.

వర్క్ ఫ్రం హోమ్, ఎండ అంటూ కాలే బయట పెట్టడం లేదు. ఇక డి విటమిన్ ఎక్కణ్నుంచి అందుతుంది? దీని ప్రభావం పడే వాటిల్లో కురులూ ఒకటి. డి విటమిన్ కొత్త హెయిర్ ఫాలికల్ ఏర్పడటంలోనూ కురుల ఎదుగుదలలోనూ



సాయపడుతుంది. కాబట్టి, రోజూ కనీసం పావుగంట ఎండలో గడపండి. అలాగే మష్రూమ్, ఫోర్టిఫైడ్ డెయిరీ ఉత్పత్తులు తీసుకున్నా మంచిదే.

చాలామంది కొబ్బరి నూనెలో ఈ విటమిన్ ఆయిల్ కలిపి రాస్తుంటారు. నిజానికి ఇది మాడుకి స్పా లాంటిదే. ఇది రక్తప్రసరణ బాగా జరిగేలా చూస్తూ కుదుళ్లు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. లోపల్నుంచీ దీన్ని అందించాలంటే బాదం, ప్రొద్దుతిరుగుడు గింజలు, పాలకూర, అవకాడో వంటివాటినీ ఆహారంలో చేర్చుకోవాలి.

విటమిన్ ఎ... మన శరీరంలోని ప్రతి కణానికీ ఇది అవసరమే. ఇది చర్మం నుంచి నూనెలు విడుదలవ్వడానికి సాయపడుతుంది. ఫలితంగా చర్మమేకాదు, కురులకూ తేమ అంది ఆరోగ్యంగా మెరుస్తాయి. క్యారెట్, చిలగడదుంప, లివర్, పాలకూర వంటివి తీసుకుంటే ఇది పుష్కలంగా అందుతుంది. వీటితోపాటు విటమిన్ సి ఉండే నిమ్మ, జామ, స్ట్రాబెర్రీ, బ్రొకలీ వంటివీ తీసుకుంటే మంచిది.

పైపై పూతలు ఎన్ని పూసినా ఫలితం కొంతే. లోపల్నుంచీ పోషణ అందించాలి. కాబట్టి, వీటిని తాజాగా రోజువారీ ఆహారంలో తీసుకోవడానికి ప్రయత్నించండి. సమస్య ఎక్కువగా ఉంటే వైద్యుల సాయంతో సప్లిమెంట్లనీ తీసుకోవచ్చు.

# ఒంటరిగా... తినేద్దామా!

ఇష్టమైన స్నేహితురాళ్లతో కలిసి... చిన్న గెట్ టు గెదర్‌లూ, పార్టీలూ, విందులూ ప్లాన్ చేసుకుంటే రోజంతా ఎంత ఆనందంగా గడిచిపోతుందో కదా. మనసుకీ మెదడుకీ విశ్రాంతి దొరికి ప్రశాంతంగా అనిపిస్తుంది. అయితే ఇలా అందరితో కలిసి వెళ్లి, భోజనం చేసేకన్నా... 'సోలో డైనింగ్' ప్రయత్నించమంటున్నారు నిపుణులు. అంటే... మీరొక్కరే మీకు నచ్చిన రెస్టరంటుకు వెళ్లి, నచ్చిన భోజనం చేసి రావడం అన్నమాట. ఇదివరకు ఒక్కరు కూర్చుని తినడాన్ని ఒంటరితనంగా భావించేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో మానసిక సంతులతకు ఇదే పరిష్కారం అంటున్నారు నిపుణులు. వీలైతే గ్యాడ్జెట్ ఫ్రీ డైనింగ్‌ను ప్లాన్ చేసుకోమంటున్నారు. ఇది కూడా ఓ విధంగా 'మీ టైమ్' లాంటిదే. దీన్ని మెదడుకు మంచి విరామంగా చెబుతున్నారు.



దీనివల్ల యాంగ్జయిటీ కూడా తగ్గుతుందట. భావోద్వేగాలపైన నియంత్రణ వస్తుందట. అందుకే గ్రూప్‌కి బదులు వారంలో ఒకసారైనా సోలో డైనింగ్ చేయమంటున్నారు.

# ప్రాజెక్టుల్లో పూడికతీత.. ఇసుక ద్వారా రాష్ట్రం ఆదాయం పొందొచ్చు: మంత్రులు

హైదరాబాద్: తెలంగాణ వాణిజ్య పన్నులు, గనుల శాఖ ఆదాయంలో పెరుగుదల కనిపించినప్పటికీ.. మిగతా శాఖల్లో వెనకబాటు కనిపిస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆదాయ వనరులపై కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. కమర్షియల్ టాక్స్ శాఖలో 4.7 శాతం, గనుల శాఖలో 18.6 శాతం పెరుగుదల ఉందని మంత్రులు తెలిపారు. భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో పూడికతీత పనులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. పూడిక తీయడం వల్ల సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు.. ఇసుక ద్వారా రాష్ట్రానికి ఆదాయం సమకూరుతుందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక తవ్వే పనులను పూర్తిగా ట్రైబల్ ఏజెన్సీలకే అప్పగించాలని, దానివల్ల గిరిజనులు ఆర్థికంగా బలోపేతం అవుతారని మంత్రులు తెలిపారు. గిరిజనులకు ఐటీడీఏలోని ఇంజనీరింగ్ విభాగం యంత్ర సామగ్రి సహాయం అందించాలని సూచించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమల తరలింపునకు మూడు వారాల్లో విధి విధానాలు రూపొందించాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, ఉన్నతాధికారులు సందీప్ కుమార్ సుల్తానియా, వికాస్ రాజ్, లోకేష్ కుమార్, శ్రీధర్, శశాంక, రాజీవ్ గాంధీ హనుమంతు, సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## చర్లపల్లి డ్రగ్స్ కేసుపై సమగ్ర నివేదిక ఇవ్వండి.. మంత్రి జూపల్లి ఆదేశం

హైదరాబాద్: చర్లపల్లిలో డ్రగ్స్ కేసును ముంబయి పోలీసులు ఛేదించి.. భారీ మొత్తంలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో 12 మందిని అరెస్టు చేశారు. ఈ వ్యవహారంపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. ఈ కేసుకు సంబంధించి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ ఏం చేస్తోందని ప్రశ్నించారు. డ్రగ్స్ వినియోగం, రవాణాపై మరింత నిఘా పెట్టాలని మంత్రి స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖ, పోలీసులు సమన్వయంతో పనిచేయాలన్నారు. చర్లపల్లి డ్రగ్స్ తయారీ ఫ్యాక్టరీని క్షేత్రస్థాయిలో పరిశీలించి, 24 గంటల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, మాదకద్రవ్యాల నియంత్రణకు కార్యాచరణ రూపొందించాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు.



## తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఉత్తమ్

హైదరాబాద్: బ్యారేజీల భద్రత, వినియోగాన్ని నిర్ధరించేందుకు వర్షాకాలం ముందే చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తుమ్మిడిహట్టి కోసం సవరించిన డీపీఆర్, ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, మహారాష్ట్రతో చర్చల కోసం షెడ్యూల్ ఖరారు చేయాలని అధికారులకు సూచించారు. నీటిపారుదలశాఖ అధికారులతో ఉత్తమ్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. సమ్మక్క సారక్క ఆనకట్ట విషయంపై ఈ నెల 23న టీఏసీ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నివేదిక సమర్పించడంతోపాటు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ కోసం ప్రయత్నించాలని అధికారులకు సూచించారు. పీఎంకేఎస్‌వై పథకం ద్వారా నిధుల కోసం కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణలో ఎన్డీఎస్‌ఏ నివేదిక ప్రకారం ముందుకెళ్తామని అన్నారు. వరద తగ్గిన వెంటనే ఐఐటీ లాంటి సంస్థలతో పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. "పాలమూరు, రంగారెడ్డి, జూరాల, కల్వకుర్తి ప్రాజెక్టులను ప్రాధాన్యంగా పరిగణించాలి. 4 ప్రాజెక్టుల భూ సేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు, పెండింగ్ సమస్యలపై దృష్టి సారించాలి. డిండి, ఎస్ఎల్‌బీసీ, పెండ్లిపాక, నక్కలగండి, కొడంగల్‌నారాయణపేట ప్రాజెక్టుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. భూసేకరణ వేగవంతం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. దేవాదుల ప్రాజెక్టు 3, 6 ప్యాకేజీల పనులు వేగవంతం చేయాలి. తదుపరి కేబినెట్ సమావేశానికి పురోగతి నివేదిక సమర్పించాలి. అన్ని ప్రాజెక్టుల్లో దశలవారీగా పూడికతీతకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి" అని ఉత్తమ్ సూచించారు. మరోవైపు ఎస్ఎల్‌బీసీ పనుల కోసం హెలిబోర్న్ సర్వే విషయంపై ఎన్జీఆర్ఐ, హిమాలయన్ హెలీ సర్వీసెస్, జేపీ అసోసియేట్స్ ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ వద్ద 2 హెలిప్యాడ్‌లను సర్వే కోసం ఉపయోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. డీజీసీఏ, ఇతర అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. క్షేత్రస్థాయి అధ్యయనాలు కొనసాగించాలన్నారు.





## తెలంగాణ గ్రూప్ 1 పిటిషన్లపై తీర్పు వెలువరించనున్న హైకోర్టు

హైదరాబాద్: టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్ 1 పిటిషన్లపై హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించనుంది. మూల్యాంకనాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు నేతృత్వంలోని ధర్మాసనం ఇప్పటికే విచారణ చేపట్టింది. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం గతంలో తీర్పును రిజర్వ్ చేసింది.

## రాహుల్ గాంధీ ప్రధాని కావడం దేశానికి అవసరం: భట్టి

హైదరాబాద్: రాహుల్ గాంధీ ప్రధాని కావడం దేశానికి చాలా అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ నేతలను ఉద్దేశించి మాట్లాడారు. అందరం కలిసికట్టుగా పనిచేసి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. "ఎన్నికల ముందు పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ లేదా ప్రభుత్వ పదవిలో ఏదో ఒకటి తప్పకుండా వస్తుంది. కాంగ్రెస్ పార్టీ అజేయంగా ఉండేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేపట్టే ప్రతి పనికి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కేబినెట్ అంతా అండగా ఉంటుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించేందుకు, సవాళ్లను ఎదుర్కొని న్యాయం చేసేందుకు ముందుకు వెళ్తున్నాం. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ పరిమితిని భారత రాష్ట్ర సమితి పెట్టింది. 42 శాతం రిజర్వేషన్ బిల్లును భాజపా రాష్ట్రపతి దగ్గర ఆపింది. ఈ విషయంలో భారత రాష్ట్ర సమితి, భాజపా కుట్ర దాగి ఉంది" అని భట్టి విమర్శించారు.





## హైదరాబాద్‌లో రద్దయిన పెద్ద నోట్లు పట్టివేత

హైదరాబాద్: నగరంలో రద్దయిన పెద్ద నోట్లు భారీ మొత్తంలో పట్టుబడ్డాయి. నారాయణగూడ శాంతి థియేటర్ ఎదురుగా ఉన్న కెనరా బ్యాంక్ వద్ద ఇద్దరిని, వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద ఇద్దరిని ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 3 బ్యాగుల్లో తనిఖీలు చేయగా.. రూ. 2 కోట్లు విలువ చేసే రద్దయిన రూ.500, రూ.1000 నోట్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. తదుపరి విచారణ నిమిత్తం నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## బాలాపూర్ గణేశుడికి రికార్డ్ స్థాయిలో హుండీ ఆదాయం.. ఎంతో తెలిస్తే షాకే!

బాలాపూర్.. ఆ పేరు వింటేనే గుర్తొచ్చేది వినాయకుడి లడ్డూ. అక్కడ ప్రతిష్ఠించే గణనాథుడి చేతిలో లడ్డూను కైవసం చేసుకుంటే సకల శుభాలు కలిగి కోటీశ్వరులవుతారని ప్రసిద్ధి. అలాంటి బాలాపూర్ గణనాథుడి మండపాన్ని ఈసారి నిర్వాహకులు స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నమూనాలో ఏర్పాటు చేశారు. దీంతో పట్టణ ప్రజలంతా బాలాపూర్ గణేశుడి దర్శనంతోపాటు వేసిన స్వర్ణగిరి సెట్‌ను కనులారా వీక్షించేందుకు లక్షల్లో తరలివచ్చారు. గతంలోనూ కైలాసగిరి, బద్రినాథ్, రామేశ్వరమ్, అయోధ్య రాముని ఆలయం వంటి ప్రసిద్ధ ఆలయాలను నమూనాగా రూపొందించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే భక్తుల తాకిడితో బాలాపూర్ గణేశుడికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం సమకూరింది. 11 రోజుల ఉత్సవాల్లో భాగంగా భక్తులు ఏకంగా రూ.23,13,760 కానుకల రూపంలో సమర్పించుకున్నారు. అయితే, ఇప్పటికే బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితికి లడ్డు వేలం ద్వారా రూ.35 లక్షల ఆదాయం వచ్చిన విషయం తెలిసిందే.



## భాజపా రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించిన అధిష్ఠానం

హైదరాబాద్: భాజపా తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీని పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, 8 మంది రాష్ట్ర ఉపాధ్యక్షులతో కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా గౌతంరావు, తూళ్ల వీరేందర్‌గౌడ్, వేముల అశోక్‌ను నియమించినట్లు తెలంగాణ భాజపా చీఫ్ రామచందర్‌రావు వెల్లడించారు. అలాగే, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బూర నర్సయ్యగౌడ్, కాసం వెంకటేశ్వర్లు, బండారి శాంతి కుమార్, కొల్లి మాధవి, జయశ్రీ, బండా కార్తికరెడ్డి, రఘునాథ్ రావు, కల్యాణ్ నాయక్‌లను నియమించినట్లు తెలిపారు. వీరితోపాటు ఏడు మోర్చాలకు రాష్ట్ర అధ్యక్షులను ప్రకటించారు.



## జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి భారీ జరిమాన

తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీరెరా) జూబ్లీ హిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌పై సుమోటా కేసు నమోదు చేసి, రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) యాక్ట్, 2016లోని సెక్షన్ 3, 4లను ఉల్లంఘించినందుకు రూ.18,51,255 జరిమానా విధించింది. దీంతో పాటు రెరాలో రిజిస్ట్రేషన్ పూర్తయ్యేవరకు ప్రాజెక్టు గురించి ఏలాంటి ప్రచారం చేయకూడదని, బుకింగ్ నిషేధమని, ఈ ఆదేశాలు పాటించకపోతే రెరా యాక్టు సెక్షన్ 63 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రెరా హెచ్చరించంది. సొసైటీ సభ్యులు డాక్టర్ కె. జ్యోతి ప్రసాద్ కోసరాజు జనవరి 28, 2025న రెరాకు సమర్పించిన ఫిర్యాదు ఆధారంగా ఈ సుమోటు కేసు నమోదు చేశారు. మంచిరేవుల గ్రామంలోని 'జూబ్లీహిల్స్ ఫేజ్ 4' ప్రాజెక్టును రెరా రిజిస్ట్రేషన్ లేకుండా ప్రకటనలు చేసి, ప్లాట్లు అమ్మకానికి ఆహ్వానిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. సొసైటీ మేనేజింగ్ కమిటీ రూ.5 లక్షలు అడ్వాన్స్‌గా వసూలు చేయడంతోపాటు సభ్యత్వం కోసం ఫ్లాట్ కొనుగోలును తప్పనిసరి చేసిందని, ఇది సొసైటీ బైలాస్, తెలంగాణ కోఆపరేటివ్ సొసైటీల చట్టాన్ని ఉల్లంఘిస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు, థర్డ్ పార్టీ డెవలపర్ 'వెర్డాంట్ బిల్డర్స్'తో కలిసి పనిచేస్తున్నట్లు, హెచ్‌ఎండీఏ, రెరా అనుమతులు, ఎక్రో అకౌంట్ లేకుండా ప్రాజెక్టును ప్రమోట్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దాదాపు రూ.90 కోట్లు వసూలు చేసినట్లు, కమిషన్‌లు, నగదు లావాదేవీలు జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రెరా చర్యలు.. ఫిబ్రవరి 7, 2025న షోకాజ్ నోటీసు జారీ చేసిన రెరా, సొసైటీ, వెర్డాంట్ బిల్డర్స్ నుంచి వివరణలు కోరింది. సొసైటీ తమపై హైకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉందని, ఫిర్యాదు ఫారమ్ (ఎం)లో లేదని వాదించింది. అయితే, రెరా తన సుమోటు అధికారాలను వినియోగించుకుని, ప్రాజెక్టు రిజిస్ట్రేషన్ లేకుండా ప్రకటనలు చేయడం ఉల్లంఘన అని తేల్చింది. 13.713 ఎకరాల్లో 1910 యూనిట్లు, 40 అంతస్తులు, రెండు క్లబ్ హౌస్‌లతో ప్రాజెక్టును బ్రోచర్ల ద్వారా ప్రమోట్ చేసినందుకు సొసైటీని బాధ్యుడిగా నిర్ధారించిన రెరా, వెర్డాంట్ బిల్డర్స్‌పై ఎలాంటి ఆధారాలు లేవని తోసిపుచ్చింది. జరిమానా 30 రోజుల్లో చెల్లించాలని, ప్రాజెక్టు ప్రమోషన్‌ను నిలిపివేయాలని ఆదేశించింది. లేకుంటే సెక్షన్ 63 కింద మరిన్ని శిక్షలు విధిస్తామని హెచ్చరించింది. ఈ తీర్పు రియల్ ఎస్టేట్ సెక్టార్‌లో పారదర్శకత, నిబంధనల పాటింపును బలోపేతం చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సొసైటీ ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టులో కేసు పెండింగ్ ఉన్న రెరా తన అధికారాలను స్వతంత్రంగా వినియోగించుకుంటుందని వెల్లడించింది.



# ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో 'ఈవీఎం'లు ఎందుకు వాడరు..?

దేశ ఎన్నికల నిర్వహణలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (EVM)లు అత్యంత కీలకంగా మారిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఐదు లోక్‌సభ, 130 అసెంబ్లీ ఎన్నికల్లో వీటిని ఉపయోగించారు. అయినప్పటికీ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మాత్రం వీటిని ఉపయోగించే పరిస్థితి లేదు. వాటిని ఓటు అగ్రిగేటర్లుగా రూపొందించడమే ఇందుకు కారణం. దేశంలో గత రెండు దశాబ్దాలుగా ఈవీఎంలను వినియోగిస్తున్నారు. అయితే.. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలు వంటి ప్రత్యక్ష ఎన్నికల్లో ఉపయోగించేందుకు వీలుగా (Vote Aggregator) వీటిని రూపొందించారు. అభ్యర్థి పేరు పక్కన ఉన్న బటన్‌ను ఓటరు నొక్కాల్సి ఉంటుంది. ఆయా అభ్యర్థులకు పోలైన ఓట్లను మాత్రమే ఇది చూపిస్తుంది. అత్యధిక ఓట్లను పొందిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. కానీ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నిక మాత్రం ఇందుకు భిన్నం. దామాషా ప్రాతినిధ్య విధానం ప్రకారం ఈ ఎన్నికలు జరుగుతాయి. సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటింగు పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల్లో రహస్య బ్యాలెట్ విధానం అనుసరిస్తారు. ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థుల పేర్ల పక్కన ఓటర్లు తమ ప్రాధాన్యం తెలిపే అంకె (1, 2..) వేయాలి. అక్షరాల్లో రాయకూడదు. బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్యనుబట్టి ఓటర్లు తమకు నచ్చినంత వరకు ప్రాధాన్య అంకెలను బ్యాలెట్‌పై రాయొచ్చు. ఓటు చెల్లుబాటు కావాలంటే మొదటి ప్రాధాన్య అంకె తప్పనిసరిగా వేయాలి. మిగతా ప్రాధాన్య అంకెలు నచ్చితే వేయొచ్చు.. లేదంటే లేదు. ఈ ఓటింగ్ కోసం ఈసీ ఓటర్లకు ప్రత్యేక పెన్నులు అందిస్తుంది. ఆ పెన్నుతోనే ఓటర్లు మార్కింగు చేయాల్సి ఉంటుంది. మరే పెన్ను వాడినా కౌంటింగులో ఆ ఓటును చెల్లుబాటు కానిదిగా పక్కన పెడతారు. దామాషా ప్రాతినిధ్య విధానంలో జరిగే ఈ ఎన్నికల్లో ప్రాధాన్యత ఆధారంగా ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది.




ఇందుకోసం భిన్న సాంకేతికతతో కూడిన ఈవీఎంలు అవసరం. ప్రస్తుత ఈవీఎంలు కేవలం ఓట్ల అగ్రిగేటర్లుగా పనిచేస్తాయి. అందుకే వీటిని రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో వాడలేమని అధికారులు చెబుతున్నారు.

**ఈవీఎంల ప్రస్థానం..**

ఈసీ ప్రకారం.. ఈవీఎం రూపకల్పన ప్రయత్నాలు 1977లోనే మొదలయ్యాయి. హైదరాబాద్‌లోని ఈసీఐఎల్... దీని రూపకల్పన, అభివృద్ధి బాధ్యతలు చేపట్టింది. 1979లో ఓ నమూనా తయారు చేయగా.. 1980లో అన్ని రాజకీయ పార్టీల ముందు దీని పనితీరును ప్రదర్శించింది. 1982లో కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి దీనిని ఉపయోగించారు. అయితే, దీనికి సంబంధించిన చట్టంలో స్పష్టమైన నిబంధనలు లేకపోవడంతో సుప్రీంకోర్టు ఆ ఎన్నికను కొట్టివేసింది. ఆ తర్వాత 1989లో ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించి.. ఎన్నికల్లో ఈవీఎంల వాడేందుకు అనువైన నిబంధనలు పొందుపరిచారు. వీటిని ప్రవేశపెట్టడంపై 1998లో ఏకాభిప్రాయం కుదరగా.. పలు రాష్ట్రాల్లోని 25 అసెంబ్లీ స్థానాల్లో ప్రయోగాత్మకంగా ఉపయోగించారు. ఆ తర్వాత 2001లో తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో వీటిని ఉపయోగించారు. ఆ తర్వాత అన్ని ఎన్నికల్లో ఈసీ వీటినే వినియోగిస్తోంది.




## రూ.10 టికెట్ చెల్లించలేదని..
## పిల్లల్ని 25 కి.మీ తిప్పిన కండక్టర్

టికెట్‌కు సరిపడా డబ్బులు ఇవ్వలేదని ఓ బస్సు కండక్టర్ ఇద్దరు పిల్లలను వారి స్టాప్‌లో దిగనివ్వకుండా అదనంగా 25 కిలోమీటర్ల మేర తిప్పాడు. ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో ఈ వ్యవహారం వెలుగుచూసింది. ఆరు, ఏడో తరగతి చదువుతున్న ఇద్దరు బాలలు నాద్‌పుర్ నుంచి బైశింగా బజార్‌కు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కారు. టికెట్‌కు రూ.10 తక్కువగా ఉన్నాయని, బస్సు దిగే సమయంలో అక్కడ తన తండ్రి సరోజ్ చెల్లిస్తాడని ఓ బాలుడు కండక్టర్ ప్రతాప్ బైతాకు చెప్పాడు. అయితే, గమ్యస్థానానికి చేరుకున్న సమయంలో సరోజ్ అక్కడ లేకపోవడంతో.. కండక్టర్ ఆ ఇద్దరు పిల్లలను బస్సు దిగనివ్వలేదు. బలవంతంగా వారిని చివరి స్టాప్ వరకు తీసుకెళ్లాడు. మరోవైపు.. బస్టాప్‌లో పిల్లలు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన సరోజ్ కండక్టర్‌ను సంప్రదించగా.. నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. ఎట్టకేలకు గంటన్నర తర్వాత బస్సు తిరుగు ప్రయాణంలో బైశింగా బజార్‌కు చేరుకున్న సమయంలో స్థానికులు అడ్డుకున్నారు. కండక్టర్‌ను నిలదీయడంతో.. అతడు క్షమాపణలు చెప్పాడు.

## అల్లం అదరహో..
## రైతుకు కాసులు కురిపించిన పంట

ముంబయి: సంప్రదాయ సేద్యానికి ఆధునిక సాగు పద్ధతులను జోడిస్తే కొద్దిపాటి వ్యవసాయ భూమి నుంచీ పెద్దమొత్తంలో దిగుబడులను, అదే స్థాయిలో లాభాలను పొందొచ్చు. మహారాష్ట్రలోని కోపర్‌గావ్ తాలుకా ఓగ్దీ గ్రామానికి చెందిన మనోజ్ అనే రైతే దీనికి ఉదాహరణ. ఆయన 30 గుంటల భూమిలో 280 క్వింటాళ్ల అల్లాన్ని పండించారు. 14 నెలల్లోనే దాదాపు రూ.4.50 లక్షల లాభాన్ని గడించారు. మనోజ్ మొదట్లో మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంటలు వేసేవారు. పెరుగుతున్న ఖర్చులు, ధరలు పడిపోవడం వంటి కారణాలతో ఆశించిన స్థాయిలో ఆదాయం రాలేదు. ఆ సమయంలో గ్రామంలోని కొందరు రైతులు అల్లం పంటను విజయవంతంగా సాగు చేస్తుండడం గమనించారు. ఈ క్రమంలోనే నిపుణుల సలహాలు తీసుకొని.. మాహిమ్ రకం విత్తనాలతో 30 గుంటల్లో అల్లం పంట వేశారు.



సేంద్రీయ ఎరువులు, బిందు సేద్యం వంటి సాగు విధానాలు అవలంబించారు. దాదాపు 14 నెలల తర్వాత 280 క్వింటాళ్ల మేర దిగుబడి చేతికొచ్చింది. మొదట్లో మార్కెట్ రేట్ అంతగా లేకపోవడంతో.. పండించిన అల్లాన్ని ఇంట్లోనే నిల్వ చేశారు. కొన్ని రోజులకు ధర పెరగడం గమనించి రూ.9 లక్షలకు విక్రయించారు. సాగు ఖర్చులు పోను.. రూ.4.5 లక్షల లాభం వచ్చినట్లు మనోజ్ తెలిపారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నిక..
## భారత రాష్ట్ర సమితి తరహాలో మరో పార్టీ దూరం

భువనేశ్వర్: ఉప రాష్ట్రపతి ఎన్నిక మంగళవారం జరగనున్న నేపథ్యంలో పలు రాజకీయ పార్టీలు తమ నిర్ణయాలను ప్రకటిస్తున్నాయి. ఈ ఎన్నికలకు దూరంగా ఉండనున్నట్లు ఇప్పటికే భారత రాష్ట్ర సమితి ప్రకటించగా.. తాజాగా ఒడిశాలోని ప్రధాన ప్రతిపక్షపార్టీ బిజూ జనతాదళ్ సైతం అదే వైఖరిని అవలంబిస్తూ నిర్ణయం తీసుకుంది. మంగళవారం జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నిక ఓటింగ్‌లో తమ పార్టీ ఎంపీలు దూరంగా ఉంటారని బీజేడీ రాజ్యసభ ఎంపీ సస్మిత్ పాత్రా దిల్లీలో వెల్లడించారు. పార్టీ ఎంపీలు, రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)తో సంప్రదింపుల అనంతరం బీజేడీ అధినేత, మాజీ సీఎం నవీన్ పట్నాయక్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు దిల్లీలో ప్రకటించారు. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే, కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమిలకు తమ పార్టీ సమాన దూరం కొనసాగించాలనే విధానంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తమ దృష్టి అంతా రాష్ట్రాభివృద్ధి, 4.5 కోట్ల మంది ప్రజల అభ్యున్నతిపైనేనని పాత్రా స్పష్టం చేశారు. బిజూ జనతాదళ్‌కు రాజ్యసభలో ఏడుగురు ఎంపీలున్నారు. ఉపరాష్ట్రపతి పోలింగ్ మంగళవారం జరగనుంది. ఎన్డీయే అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పోటీపడుతుండగా.. విపక్ష కూటమి తరఫున తెలంగాణకు చెందిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి బరిలో ఉన్న విషయం తెలిసిందే.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు రెడీ.. అభ్యర్థుల బలాలు ఎలా ఉన్నాయంటే!

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి స్థానం భర్తీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఈ పదవి కోసం ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిలు పోటీ పడుతున్నారు. సెప్టెంబర్ 9న ఎన్నిక జరగనుంది. అయితే, అధికార ఎన్డీయేకు పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. పార్టీలకు అతీతంగా ఎంపీలు ఓటు వినియోగించుకోవాలని విపక్ష అభ్యర్థి ప్రచారం చేయడంతో ఉపరాష్ట్రపతి ఎన్నికపై కాస్త ఉత్కంఠ నెలకొంది. ఉపరాష్ట్రపతి ఎన్నికలో రహస్య ఓటింగ్ విధానాన్ని అనుసరిస్తారు. రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో కూడుకున్న ఎలక్టోరల్ కాలేజీలో ఎంపీలు తమకు నచ్చిన వారికి ఓటు వేసే వెసులుబాటు ఉంటుంది. అయినప్పటికీ తమ పార్టీకే ప్రాధాన్యం ఇస్తారు. క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశమూ ఉంటుంది.

**ఎన్డీయే vs ఇండియా..**

లోక్‌సభ 542, రాజ్యసభలో 239 సభ్యులు కలిసి మొత్తం ఎలక్టోరల్ సంఖ్య 781. ఇందులో ప్రతి సభ్యుడి ఓటు విలువ ఒకటిగానే ఉంటుంది. మెజార్టీ మార్కు 391. అధికార ఎన్డీయే కూటమికి ఇప్పటివరకు 422 సభ్యుల బలముంది. దీంతో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపు ఖాయంగానే కనిపిస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ (11 మంది సభ్యులు).. ఎన్డీయేకు మద్దతు ఇస్తుండడంతో మెజార్టీ పెరగనుంది. మరిన్ని పార్టీలు మద్దతు తెలిపే అవకాశం ఉంది. విపక్షాల ఇండియా కూటమికి 311 మంది బలముంది. ఇతరులు 45 మంది ఉన్నారు. వీరితో సహా కొన్ని పార్టీలు మద్దతిచ్చినా విపక్ష అభ్యర్థి విజయానికి దూరంగానే కనిపిస్తున్నారు. దీంతో పార్టీలకు అతీతంగా ఆలోచించి ఓటు వేయాలని విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇప్పటికే ఎంపీలకు విజ్ఞప్తి చేశారు.

**ఇతర పార్టీలు ఎటువైపు..?**

మరోవైపు ఈ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు భారత రాష్ట్రసమితి తాజాగా ప్రకటించింది. దీంతో



నలుగురు సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం లేదు. ఏడుగురు ఎంపీలున్న బిజు జనతాదళ్ ఈ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించింది. శిరోమణి అకాలీదళ్, జోరమ్ పీపుల్స్ మూమెంట్ (మిజోరం) వంటి పార్టీలకు ఒక్కో సభ్యులున్నారు. విపక్షాల అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు ఆమ్‌ఆద్మీ (10 మంది ఎంపీలు) ప్రకటించినప్పటికీ.. ఎంపీ స్వాతి మాలివాల్ ఆ పార్టీతో సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో ఆమె ఎవరికి ఓటు వేస్తారనే దానిపై స్పష్టత లేదు. స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీ సభ్యులు ఎవరివైపు మొగ్గు చూపుతారనే విషయంపై ఆసక్తి నెలకొంది.

## బిహార్ ఎన్నికల్లో రోజుకు 20 హెలికాప్టర్లు!.. వాయువేగంతో ప్రచారం

పట్నా: బిహార్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే ఆ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు హెలికాప్టర్ల బుకింగ్‌ల కోసం పోటీపడుతున్నాయి. 2020 ఎన్నికల్లో కొవిడ్ కారణంగా బుకింగ్‌లు పెద్దగా జరగలేదు. ఈసారి మాత్రం పోటాపోటీగా ప్రచారం జరగనుండటంతో గాలిమోటార్లకు గిరాకీ అమాంతం పెరిగింది. బిహార్‌లో సాధ్యమైనంత మేరకు అన్ని నియోజకవర్గాలను చుట్టేయాలని ముఖ్యనేతలు భావిస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు మార్గాలను నమ్ముకుంటే ప్రచారంలో వెనకబడతామనే భయం వారిలో నెలకొంది. అందుకే రోజుకు కనీసం 20 హెలికాప్టర్లు గాల్లో ఎగిరే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్, ఇండియా బ్లాక్ నేతలు ఇప్పటికే పలు హెలికాప్టర్లను బుక్ చేసుకొని ప్రచారానికి సిద్ధంగా ఉన్నారు. భారతీయ జనతా పార్టీ, జేడీయూ కూటమి చేతిలో డజన్‌కు పైగా హెలికాప్టర్లు ఉన్నట్లు సమాచారం. అందులో



దాదాపు 12 హెలికాప్టర్లు భాజపా నేతలే వినియోగిస్తారని తెలిసింది. ఐదు హెలికాప్టర్లతో ప్రచారం ముగించేయాలని ప్రతిపక్షం భావిస్తోంది. కాంగ్రెస్ రెండు హెలికాప్టర్లను బుక్ చేసినట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆర్జేడీ కూడా కొన్ని బుక్ చేసింది. ఒక సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్ అద్దె గంటకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది. అదే డబుల్ ఇంజిన్ అయితే రూ.3 నుంచి రూ.4 లక్షలు వెచ్చించాల్సి రావొచ్చు. ఎన్నికల సందడిలో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. సింగిల్ ఇంజిన్ అద్దె 25 శాతం, డబుల్ ఇంజిన్ అద్దె 100 శాతం పెరగొచ్చని తెలుస్తోంది. రోజువారీ కార్యక్రమాల కోసం బుకింగ్‌లు చేసుకునే నేతలు జీఎస్టీతో కలిపి మూడు గంటల అద్దె ముందుగా చెల్లించాలి. ఇదిలాఉండగా.. తాము పరిమిత వనరులతోనే ప్రచారం సాగిస్తున్నామని ఆర్జేడీ నేత రాజేశ్ యాదవ్ తెలిపారు. 'మా అధినేత లాలూప్రసాద్ యాదవ్ పాతబడిన జీపులో ప్రచారం చేస్తారు' అని పేర్కొన్నారు. తేజస్వీకి యువత మద్దతు ఉందని వ్యాఖ్యానించారు. తక్కువ సమయంలో ఎక్కువ ప్రాంతాలను చుట్టేయాల్సిన అవసరం ఉన్నప్పుడు మాత్రమే హెలికాప్టర్లను వినియోగిస్తామని స్పష్టంచేశారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టేయాలనే ఆలోచనతో హెలికాప్టర్లు బుకింగ్ చేసుకుంటున్నామని భాజపా అధికార ప్రతినిధి వినోద్ శర్మ తెలిపారు. గత ఎన్నికల కంటే ఇప్పుడు ఎక్కువ హెలికాప్టర్లు బుక్ అయ్యాయని పట్నా ఎయిర్‌పోర్టు గ్లోబల్ ఫ్లైట్ సర్వీస్ మేనేజర్ దేవేంద్ర కుమార్ వెల్లడించారు.

## భారత పర్యటనకు ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి

దిల్లీ: ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ భారత పర్యటనకు రానున్నారు. నేటినుంచి మూడు రోజుల పాటు బెజలెల్ స్మోట్రిచ్ దేశంలో పర్యటించనున్నట్లు విదేశాంగ శాఖ అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరుదేశాల మధ్య కొంతకాలంగా ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరుగుతున్నాయని.. ప్రస్తుత పర్యటనలో భాగంగా భారత్‌ఇజ్రాయెల్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం పై సంతకం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఇరుదేశాల మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్యఒప్పందం దిశగా అడుగులు పడనున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. స్మోట్రిచ్ గాంధీనగర్‌లోని భారతదేశ ప్రపంచ ఆర్థికసేవల కేంద్రాన్ని సైతం సందర్శించనున్నారు. బెజలెల్ స్మోట్రిచ్ భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌లతో భేటీ అవనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని పెంపొందించడం, బలమైన, స్థితిస్థాపక పెట్టుబడి వాతావరణాన్ని సృష్టించడం, ప్రపంచ పరిస్థితులు వంటి విషయాలపై ఇరువర్గాల మధ్య చర్చలు జరిగే అవకాశం ఉంది. దిల్లీతో పాటు, ముంబయి ఇతర ప్రాంతాలను ఆయన సందర్శించనున్నట్లు తెలుస్తోంది. ఈ సంవత్సరం ఇజ్రాయెల్ మంత్రులు భారత్‌కు రావడం ఇది నాలుగోసారి. ఇజ్రాయెల్ పర్యాటక మంత్రి హైమ్ కాట్జ్, పరిశ్రమల మంత్రి



నిర్ బర్కత్, వ్యవసాయం ఆహార భద్రతా మంత్రి అవి డిచ్టర్ ఈ ఏడాది ప్రారంభంలో భారత్‌ను సందర్శించారు.

## ఆధార్‌ను ఐడీ ప్రూఫ్‌గా ఎన్నికల కమిషన్ ఆమోదించాల్సిందే: సుప్రీం కోర్టు

బిహార్ సమగ్ర ప్రత్యేక సవరణలో ఆధార్‌ను కూడా కచ్చితంగా గుర్తింపు కార్డుగా పరిగణించాలని సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌కు మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే అదే సమయంలో ఆధార్ పౌరసత్వానికి మాత్రం ధ్రువీకరణ కాదని పేర్కొంది. అక్రమ వలసదారుల సమస్య దృష్ట్యా.. అవసరమైన వేళ ఎన్నికల కమిషన్ సదరు ఆధార్ సరైనదేనా అనేది తనిఖీ చేయవచ్చని వెల్లడించింది. రాష్ట్రీయ జనతాదళ్, ఏఐఎంఐఎం ఇతర పార్టీలు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీల ధర్మాసనానికి తమ వాదనలు వినిపించాయి. దీనికి సంబంధించి నేడు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జాబితాలో చేర్చడానికి లేదా తొలగించడానికి ఆధార్‌ను కూడా కమిషన్ ప్రకటించిన ధ్రువీకరణ పత్రాల జాబితాలో 12వ పత్రంగా పరిగణించాలని పేర్కొంది. ఇది 1950 నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టానికి అనుగుణంగా తీసుకొన్న నిర్ణయమని తెలిపింది. ఇప్పటికే ఈ జాబితాలో పాస్‌పోర్టు, బర్త్ సర్టిఫికెట్ వంటి 11 పత్రాలను ఐడీ ప్రూఫ్‌లుగా ఈసీ స్వీకరిస్తోంది. తమ ఆదేశాలు ప్రజలకు తెలిసేలా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలని దాని న్యాయవాది ద్వివేదికి సూచించింది. అంతకు ముందు రాకేశ్ ద్వివేది తన వాదనలు వినిపిస్తూ ఈసీఐ ఆధార్‌ను ప్రూఫ్‌గా స్వీకరించడానికి అంగీకరించినా.. పిటిషనర్లు దానిని 12వ గుర్తింపు పత్రంగా చేర్చమని కోరడం దేనికని ప్రశ్నించారు.

## చివరి సెషన్‌లో అమ్మకాలు..

### స్వల్ప లాభాలతో గట్టెక్కిన స్టాక్ మార్కెట్లు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. మార్కెట్లు ఉదయం నుంచి ముగింపు వరకు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. చివరలో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ఇంట్రాడేలో వచ్చిన లాభాలన్నీ ఆవిరవగా.. చివరకు స్వల్ప లాభాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,904.40 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,733.07 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్టంగా 81,171.38 పాయింట్ల వరకు పెరిగింది. చివరకు 76.54 పాయింట్ల లాభంతో 80,787.30 వద్ద ముగిసింది. నిఫ్టీ 32.15 పాయింట్లు పెరిగి.. 24,773.15 వద్ద స్థిరపడింది. ఆటో, మెటల్, ఆయిల్, గ్యాస్, పీఎస్‌యూ బ్యాంకులు రాణించడంతో నిఫ్టీ 24,885.50 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. అయితే, చివరి గంటలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో.. స్వల్ప లాభాలతో బయటపడింది.

బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.5శాతం పెరిగాయి. నిఫ్టీలో ప్రధానంగా టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐషర్ మోటార్స్, ఎం అండ్ ఎం, బజాజ్ ఆటో నిఫ్టీలో లాభాలను ఆర్జించాయి. ట్రెంట్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్, టెక్ మహీంద్రా నష్టపోయాయి. ఆటో ఇండెక్స్ 3.3శాతం, రియాలిటీ ఆయిల్, గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, మెటల్ 0.5 శాతం నుంచి ఒకశాతం వరకు పెరిగాయి. కార్లు, ఎస్‌యూవీల ధరల తగ్గింపుతో టాటా మోటార్స్ షేర్లు 3.6శాతం పెరిగాయి, ఐసీఈ ఎస్‌యూవీ పోర్ట్‌ఫోలియోలో ధరల తగ్గింపుతో మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు 4శాతం వృద్ధిని నమోదు చేశాయి. సింగపూర్‌కు చెందిన హోరిజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీస్‌తో అవగాహన ఒప్పందంతో బీహెచ్‌ఈఎల్ షేర్ ధర 2.3శాతం పెరిగింది. జుహై పివిన్ న్యూ ఎనర్జీతో వ్యూహాత్మక భాగస్వామ్యం తర్వాత సర్వోటెక్ షేర్లు 5.8శాతం పెరగ్గా.. భూటాన్‌లో 570 మెగా వాట్స్ జలవిద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడంతో అదానీ పవర్ షేర్ ధర 4.2శాతం పెరిగింది. స్పైస్‌జెట్ షేర్లు 3.25శాతం.. వేదాంత 2శాతం, జైప్రకాష్ అసోసియేట్స్ షేర్లు 5శాతం పడిపోయాయి.

## టీవీఎస్ నుంచి సరికొత్త స్కూటర్ విడుదల..

### పవర్‌ఫుల్ ఇంజిన్.. ఫీచర్స్ అదుర్స్!



**న్యూఢిల్లీ:** భారతదేశంలో ప్రతి నెలా పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలు అమ్ముడవుతున్నాయి. స్కూటర్ విభాగం కూడా ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తుంది. టీవీఎస్ మోటార్ 150సీసీ స్కూటర్ విభాగంలో కొత్త ఎంపికగా టీవీఎస్ ఎన్ టార్క్ 150ని విడుదల చేసింది. ఈ స్కూటర్ ఏ శక్తివంతమైన ఇంజిన్‌తో విడుదల చేసింది. దీనిలో అద్భుతమైన ఫీచర్స్‌ను అందించింది కంపెనీ. భారతదేశంలో అత్యంత వేగవంతమైన, మొట్టమొదటి హైపర్ స్పోర్ట్ స్కూటర్ 150 అని కంపెనీ తెలిపింది. ఇది అత్యంత వేగంతో కేవలం 6.3 సెకన్లలో 0-60 కి.మీ/గంట అందుకునే సామర్థ్యం ఉంటుందని తెలిపింది

150 స్కూటర్ అనేక గొప్ప లక్షణాలతో విడుదలైంది. దీనిలో ప్రొజెక్టర్ హెడ్‌లైట్, హజార్డ్ ల్యాంప్, ఫాలో మీ హెడ్‌లైట్, ఫోర్ వే నావిగేషన్ ప్రీమియం స్విచ్, అడ్జస్టబుల్ బ్రేక్ లివర్, ట్రాక్షన్ కంట్రోల్, అసిస్ట్, స్ట్రీట్ మరియు రేస్ రైడ్ మోడ్‌లు, డిజిటల్ స్పీడోమీటర్, బ్లూటూత్ కనెక్టివిటీ, టర్న్ బై టర్న్ నావిగేషన్, టైప్ ఛార్జింగ్ పోర్ట్ వంటి అనేక లక్షణాలు అందించింది.

తయారీదారు ఈ స్కూటర్‌కు 149.7 సిసి సామర్థ్యం గల సింగిల్ సిలిండర్ ఇంజిన్‌ను అందించారు. ఇది 9.7 శక్తిని, 14.2 న్యూటన్ మీటర్ టార్క్‌ను ఇస్తుంది. ఈ ఇంజిన్‌తో స్కూటర్‌ను 6.3 సెకన్లలో 0-60 కి.మీ.ల వేగాన్ని అందుకోగలదు.

తయారీదారు ఈ స్కూటర్‌ను భారతదేశంలో రెండు వేరియంట్లలో అందిస్తోంది. 150, ఎూా 150. దీని బేస్ వేరియంట్ ఎక్స్-షోరూమ్ ధర రూ.1.19 లక్షలు. అలాగే టీవీఎస్ కొత్త ఎన్‌టార్క్ 150 స్కూటర్‌ను 150సీసీ విభాగంలో విడుదల చేశారు. ఈ విభాగంలో యమహా ఏరోక్స్ 150, అప్రిలియా 150సీసీ స్కూటర్లతో పోటీ పడాల్సి ఉంటుంది. త్వరలో హీరో జూమ్ 160తో కూడా పోటీ పడాల్సి ఉంటుంది.

ఈ ఆవిష్కరణ గురించి టీవీఎస్ మోటర్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ - హెడ్,కమ్యూటర్ అండ ఈవీ బిజినెస్, హెడ్ - కార్పొరేట్ బ్రాండ్ అండ్ మీడియా అనిరుద్ధ హల్దార్ మాట్లాడుతూ.. రెండు మిలియన్లకు పైగా, 50 స్వీయ-నిర్వహణ రైడ్ గ్రూపులు, కమ్యూనిటీలు భారతదేశంలో ఎక్కువ మంది అభిమానించే, ఐకానిక్ ఆటోమోటివ్ బ్రాండ్లలో ఒకటి గా దాని రైడర్ల తో నిర్మించబడిన సంబంధాన్ని నిర్వచిస్తాయని అన్నారు.

## తగ్గిన బంగారం, వెండి ధరలు..



**న్యూఢిల్లీ:** బంగారం ధర గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా పెరిగి రికార్డు స్థాయికి చేరింది. బంగారంతోపాటు వెండి ధర కూడా భగ్గుమంటోంది. అయితే.. షేర్ మార్కెట్ నుంచి బులియన్ మార్కెట్‌కు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతుండడంతో బంగారం, వెండి ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు రూపాయి బలహీనపడడం వల్ల దిగుమతి ధరపై ప్రభావం చూపిస్తోంది. పండగలు, పెళ్లిళ్ల సీజన్ ఓవైపు.. బంగారం ధర ఇంకా పెరుగుతుందన్న వదంతుల వల్ల డిమాండ్ అమాంతం పెరిగిపోయి ధరలు భగ్గుమంటున్నాయి. వాస్తవానికి బంగారం, వెండి ధరల్లో అనునిత్యం మార్పులు చేర్పులు జరుగుతుంటాయి.. ఈ క్రమంలోనే.. నాన్‌స్టాప్‌గా పెరుగుతున్న బంగారం, వెండికి సోమవారం బ్రేకులు పడ్డాయి.. సెప్టెంబర్ 8 2025న బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి.. తాజాగా నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి.. 24క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర లక్షా, 8వేల 350 రూపాయలకు చేరింది. పది గ్రాములపై రూ.110 మేర ధర తగ్గింది. 22 క్యారెట్ల పది గ్రాముల ధర రూ.100 మేర తగ్గి.. రూ.99,350 గా ఉంది. వెండి కిలో ధర.. రూ.1000 మేర తగ్గి.. లక్షా 27వేల రూపాయలుగా ఉంది. కాగా.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది. హైదరాబాద్‌లో 24క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,08,380 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.99,350 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,37,000 గా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,08,380 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.99,350 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,37,000 గా ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగార ధర 1,08,530, 22 క్యారెట్ల ధర రూ.99,500లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,27,000లుగా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగార ధర 1,08,380, 22 క్యారెట్ల ధర రూ.99,350లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,27,000లుగా ఉంది. చెన్నైలో 24క్యారెట్ల బంగారం ధర రూ.1,08,770 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.99,700గా ఉంది. వెండి కిలో ధర రూ.1,37,000 గా ఉంది.

### యూఎస్ ఓపెన్ మెన్స్ సింగిల్స్ టైటిల్

# విజేతగా అల్కరాజ్





**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ విజేతగా స్పెయిన్ కుర్రాడు కార్లోస్ అల్కరాజ్ నిలిచాడు. టాప్‌సీడ్ యూనిక్ సిన్నర్‌తో హెూరాహెూరీగా సాగిన ఫైనల్లో 6-2, 3-6, 6-1, 6-4 తేడాతో విజయం సాధించాడు. దీంతో అల్కరాజ్ మళ్లీ ప్రపంచ నంబర్ 1 స్థానం దక్కించుకున్నాడు. మొత్తం 2.42 గంటల పాటు సాగిన నువ్వా నేనా అన్నట్లు సాగిన ఈ మ్యాచ్‌లో తొలిసెట్‌ను ఈజీగా నెగ్గిన అల్కరాస్.. రెండో సెట్‌లో సిన్నర్ పైచేయి సాధించాడు. మళ్లీ తేరుకున్న 22 ఏండ్ల స్పెయిన్ సంచలనం మూడో సెట్‌లో విజృంభించి 6-1 తేడాతో 24 ఏండ్ల ఇటలీ స్టార్‌ను మట్టికరిపించాడు. కీలక నాలుగో సెట్‌లో కూడా 6-2తో పైచేయి సాధించిన అల్కరాజ్ విజేతగా నిలిచాడు. దీంతో రెండో సారి యూఎస్ ఓపెన్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. మొత్తంగా అతనికిది ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్. 2022లో తొలిసారిగా యూఎస్ ఓపెన్‌ను దక్కించుకున్న అల్కరాజ్.. మళ్లీ మూడేండ్ల తర్వాత ఆ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ తర్వాత ముచ్చటగా మూడోసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో ఇరువురు ఆటగాళ్లు పోటీపడ్డారు. ఫ్రెంచ్ ఓపెన్‌ను అల్కరాజ్ గెలుచుకోగా, వింబుల్డన్‌ను సిన్నర్ సొంతం చేసుకున్నాడు. ఈ విజయంతో ఒకే ఏడాదిలో అల్కరాస్ రెండు గ్రాండ్ స్లామ్ టైటిళ్లు నెగ్గినట్లయింది. 2024 నుంచి ఎనిమిది మ్యాచ్‌లలో ఈ ఇద్దరు ఆటగాళ్లు తపడగా ఆరింటిలో సిన్నర్ గెలువగా, అల్కరాజ్ రెండింటిలో మాత్రమే విజయం సాధించాడు. అవికూడా ఫైనల్స్ కావడం గమనార్హం.

అల్కరాజ్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్..: యూఎస్ ఓపెన్-2022, వింబుల్డన్- 2023, రొలాండ్ గరోస్- 2024, వింబుల్డన్- 2024, రొలాండ్ గరోస్-2025, యూఎస్ ఓపెన్-2025.

## ట్రై సిరీస్ ఫైనల్లో హ్యాట్రిక్ తీసిన పాకిస్థానీ బౌలర్



**షార్జా:** ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన యూఏఈ టీ20 ట్రై సిరీస్ ఫైనల్లో పాకిస్థానీ బౌలర్ మొహమ్మద్ నవాజ్ హ్యాట్రిక్ తీశాడు. ఈ మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై 75 రన్స్ తేడాతో పాకిస్థాన్ విక్టరీ కొట్టింది. ఆ జట్టు బౌలర్ నవాజ్ తన స్పిన్ మంత్రంతో ఆఫ్ఘన్‌ను కట్టడి చేశాడు. ఫైనల్లో 19 రన్స్ ఇచ్చి అయిదు వికెట్లు తీసుకున్నాడుతను. 142 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఆఫ్ఘన్ జట్టు 15.5 ఓవర్లలో 66 రన్స్‌కే ఆలౌటైంది. పాక్ జట్టులో ఫకర్ జమాన్ 27 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆఫ్ఘన్ కెప్టెన్ రషీద్ ఖాన్ మూడు వికెట్లు తీసుకున్నాడు.

పాక్ స్పిన్నర్ నవాజ్ ఇన్నింగ్స్ ఆరో ఓవర్‌లో చివరి రెండు బంతులకు వికెట్లు తీసుకున్నాడు. దార్విశ్ రసూలీ, అజ్మతుల్లా ఓమర్‌జాయి వికెట్లను తీశాడతను. అయితే ఆ తర్వాత ఇన్నింగ్స్ 8వ ఓవర్‌లో తొలి బంతికే ఇబ్రహీమ్ జద్రాన్‌ను ఔట్ చేసి తన ఖాతాలో హ్యాట్రిక్ వేసుకున్నాడతను. టీ20ల్లో హ్యాట్రిక్ తీసిన మూడవ పాకిస్థానీ బౌలర్‌గా నవాజ్ నిలిచాడు. గతంలో ఫహీమ్ అష్రఫ్, మొహమ్మద్ హస్నైన్ హ్యాట్రిక్ తీశారు.

## కుంబ్లే ముందు ఏడ్చేశా: క్రిస్ గేల్



**ముంబై:** ఐపీఎల్‌లో క్రిస్ గేల్‌కు ప్రత్యేక స్థానం. పొట్టి ఫార్మాట్ క్రికెట్‌లో అతను తన పవర్ హిట్టింగ్‌తో క్రికెట్ ప్రేక్షకుల్ని థ్రిల్ చేశాడు. పలు ఫ్రాంచైజీల తరపున ఆడుతూ.. భారీ షాట్లతో అతను ఆకట్టుకున్నాడు. అయితే క్రిస్ గేల్ ఓ దశలో డిప్రెషన్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. పంజాబ్ కింగ్స్ జట్టు తరపున ఆడుతున్న సమయంలో తీవ్ర మనోవేదనకు గురైనట్లు గేల్ చెప్పాడు. శుభంకర్ మిశ్రాకు ఇచ్చిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో గేల్ ఈ విషయాన్ని చెప్పాడు. కెరీర్ ముగింపు దశలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపాడు.

ఐపీఎల్‌లో అత్యధికంగా 175 రన్స్ చేసిన బ్యాటర్‌గా గేల్ రికార్డు క్రియేట్ చేశాడు. దీంతో పాటు ఎన్నో రికార్డులను అతను సొంతం చేసుకున్నాడు. ఐపీఎల్ కెరీర్ ఆరంభంలో అతను కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ఆడాడు. ఆ తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఆ సమయంలో అతను రికార్డులు తిరగరాశాడు. కోహ్లీ, డివిల్లీర్స్‌తో కలిసి ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టించాడు. కెరీర్ చివరి దశలో అతను పంజాబ్ కింగ్స్ జట్టుకు ఆడాడు. అయితే 2018 నుంచి పంజాబ్ తరపు 41 మ్యాచ్‌లు ఆడి 1339 రన్స్ స్కోర్ చేశాడతను. 2021 మధ్యలోనే అతను ఫ్రాంచైజీ నుంచి తప్పుకున్నాడు. కోవిడ్ నిబంధనల నేపథ్యంలో ఆ టోర్నీ జరిగిన విషయం తెలిసిందే.

తన ఐపీఎల్ జర్నీ అకస్మాత్తుగా ముగిసిందని గేల్ తెలిపాడు. పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ తన పట్ల అమర్యాదగా ప్రవర్తించినట్లు పేర్కొన్నాడు. తాను డిప్రెషన్‌లోకి వెళ్లే రీతిలో ఆ జట్టు చేసిందని ఆరోపించాడతను. ఓ సీనియర్‌గా తనకు అక్కడ గౌరవం దక్కలేదన్నాడు. లీగ్ కోసం ఎంతో చేశానని, ఫ్రాంచైజీకి విలువ తీసుకువచ్చానని, కానీ ఆ సమయంలో అగౌరవపరచడం సరికాదు అని గేల్ అన్నాడు. ఓ పిల్లోడిలా చూశారని, ఆ సమయంలో తన జీవితంలో తొలిసారి డిప్రెషన్ ఆలోచనలు వచ్చినట్లు గేల్ చెప్పాడు. తనకు జరిగిన అమర్యాద పట్ల అనిల్ కుంబ్లే ముందు ఏడ్చేసినట్లు తెలిపాడు. కోచ్, ఫ్రాంచైజీ వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తూ కుంబ్లే ముందు తన బాధను వెలగక్కినట్లు చెప్పాడు. ఆ సీజన్‌లో మొంబై ఇండియన్స్‌తో చివరి మ్యాచ్ ఆడేశానని, అప్పటి పంజాబ్ కెప్టెన్ కేఎల్ రాహుల్ మరో మ్యాచ్ ఆడాలని కోరినా, తాను ఆడలేకపోయినట్లు గేల్ గుర్తు చేశాడు.

## ఆసియా కప్‌లో సూర్య సేన

# అదరగొడుతుంది..



### మాజీల ఫుల్ కాన్ఫిడెన్స్

### యూఏఈ వేదికగా నేటి నుంచి ఆసియా కప్ టీ20 టోర్నీ ప్రారంభం

### సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో బరిలోకి దిగనున్న భారత జట్టు

### టీమిండియాపై దిగ్గజ క్రికెటర్లు సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి ప్రశంసలు

### ఈ నెల 10న యూఏఈతో భారత్ తొలి మ్యాచ్.. 14న దాయాదితో పోరు



**యూఏఈ:** యూఏఈ వేదికగా మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఆసియా కప్ టీ20 టోర్నమెంట్‌లో సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు అద్భుతంగా రాణిస్తుందని క్రికెట్ దిగ్గజాలు సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి ధీమా వ్యక్తం చేశారు. అనుభవం, యువత కలయికతో పటిష్ఠంగా ఉన్న ఈ జట్టు కచ్చితంగా సత్తా చాటుతుందని వారు అభిప్రాయపడ్డారు.

భారత జట్టు కూర్పుపై సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ.. "సూర్యకుమార్ యాదవ్ డైనమిక్ కెప్టెన్సీలో టీమిండియా ఆసియా కప్‌లో అడుగుపెడుతోంది. ఈ జట్టులో పట్టుదల, అనుభవం రెండూ ఉన్నాయి. సూర్య తన వినూత్న బ్యాటింగ్, కెప్టెన్సీతో జట్టులోని ఇతర సభ్యులకు స్ఫూర్తినిస్తాడు. ఈ జట్టు భారత క్రికెట్ భవిష్యత్తుకు ప్రతీక. ఆసియా కప్‌లో మన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా, టీ20 క్రికెట్‌లో భారత నూతన శకానికి పునాది వేయడానికి ఇదొక మంచి వేదిక" అని అన్నారు.

ఇదే విషయంపై భారత మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి స్పందిస్తూ.. "సూర్య ముందుండి నడిపిస్తుండగా, యువ నాయకత్వ పటిమకు ప్రతీక వంటి శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా భారత జట్టు విజయపథంలో పయనిస్తుంది. ఈ జట్టులో అనుభవం, యువ ప్రతిభకు సరైన మిశ్రమం ఉంది. జస్‌ప్రీత్ బుమ్రా, అభిషేక్ శర్మ, హార్దిక్ పాండ్యా వంటి ఆటగాళ్లు అంతర్జాతీయ అనుభవాన్ని తీసుకొస్తుంటే, తిలక్ వర్మ, హర్షిత్ రాణా వంటి యువకులు జట్టుకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తారు. సూర్య ప్రశాంతమైన, దూకుడైన కెప్టెన్సీలో ఈ జట్టు అద్భుతాలు చేస్తుందని నేను నమ్ముతున్నాను" అని శాస్త్రి తెలిపారు.

మొత్తం 8 జట్లు పాల్గొంటున్న ఈ 17వ ఎడిషన్ ఆసియా కప్‌లో భారత్ గ్రూప్ 'ఏ'లో ఉంది. సెప్టెంబర్ 10న యూఏఈతో తొలి మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో, సెప్టెంబర్ 19న ఒమన్‌తో తలపడనుంది. లీగ్ దశ తర్వాత సూపర్ ఫోర్, అనంతరం సెప్టెంబర్ 28న దుబాయ్‌లో ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

ఈ టోర్నమెంట్‌కు సంబంధించిన తెలుగు కామెంటరీ ప్యానెల్‌లో వెంకటపతి రాజు, వేణుగోపాల్ రావు, రవితేజ, జ్ఞానేశ్వర రావు వంటి మాజీ ఆటగాళ్లు ఉన్నారు. కాగా, ఈ టోర్నీ 2026 టీ20 ప్రపంచ కప్‌కు సన్నాహకంగా జట్లకు ఉపయోగపడనుంది.

# రజనీతో నాకు పోటీ లేదు..

### త్వరలోనే సినిమా: దుబాయ్‌లో కమల్ హాసన్ క్లారిటీ



టాకీస్: దక్షిణ భారత సినీ పరిశ్రమలో కొన్ని దశాబ్దాలుగా అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న కల నిజం కాబోతోంది. ఇద్దరు మహానటులు, దిగ్గజాలు రజనీకాంత్, కమల్ హాసన్ మళ్లీ కలిసి ఒకే తెరపై కనిపించనున్నారు. దాదాపు 46 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఇద్దరూ కలిసి నటించబోతున్నట్లు స్వయంగా కమల్ హాసన్ అధికారికంగా ప్రకటించారు. దుబాయ్‌లో జరిగిన సైమా అవార్డుల వేడుకలో ఈ సంచలన ప్రకటన చేసి అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు.

ఈ సందర్భంగా కమల్ హాసన్ మాట్లాడుతూ.. "ఇన్నాళ్లూ ప్రజలే మా మధ్య పోటీని సృష్టించారు. కానీ, నా మిత్రుడు రజనీకాంత్‌తో నాకు ఎలాంటి విభేదాలు లేవు. మేమిద్దరం త్వరలోనే చేతులు కలపబోతున్నాం" అని స్పష్టం చేశారు. ఒకరి సినిమాలను మరొకరం నిర్మించుకోవాలని కూడా గతంలో ప్రయత్నించామని ఆయన గుర్తుచేసుకున్నారు. కమల్ మాటల్లోని విశ్వాసం చూస్తుంటే, ఈ భారీ ప్రాజెక్ట్ అతి త్వరలోనే పట్టాలెక్కడం ఖాయమనిపిస్తోంది.

ఒకే గురువు కె. బాలచందర్ చేతుల మీదుగా సినీ రంగ ప్రవేశం చేసిన ఈ ఇద్దరు నటులు, 1979లో వచ్చిన 'అల్లావుద్దీనుమ్ అద్భుతవిళక్కుమ్' (తెలుగులో అల్లావుద్దీన్ అద్భుత దీపం) తర్వాత పూర్తిస్థాయి పాత్రల్లో కలిసి నటించలేదు. 80వ దశకం నుంచి ఇద్దరూ స్టార్‌డమ్‌లో శిఖర స్థాయికి చేరడంతో వీరిద్దరినీ కలిపి సినిమా తీసే సాహసం ఏ దర్శకుడూ చేయలేకపోయాడు. గతంలో లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో వీరిద్దరితో ఒక సినిమా ప్లాన్ చేసినా, కరోనా కారణంగా అది కార్యరూపం దాల్చలేదు.

తాజా సమాచారం ప్రకారం, ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మించనున్నాయని కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దసరా పండుగ సందర్భంగా ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటనను వెలువరించి, నవంబర్ నెలలోపు చిత్రీకరణ ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ ప్రకటనతో ఇద్దరు దిగ్గజాలను ఒకే ఫ్రేమ్‌లో చూసే అపురూప ఘట్టం కోసం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మల్లెపూలు గొల్లుమన్నవి

### ఎయిర్‌పోర్టులో నటి నవ్యకు లక్ష జరిమాన

**టాకీస్:** మల్లెపూలు తీసుకెళ్లినందుకు.. ఓ నటికి రూ. 1.14 లక్షల జరిమానా విధించిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఓ ఈవెంట్‌కు హాజరయ్యేందుకు మలయాళ నటి నవ్య నాయర్ ఆస్ట్రేలియా వెళ్లారు. ఆ సమయంలో తన బ్యాగులో నవ్య మల్లెపూలను తీసుకెళ్లారు. మెల్‌బోర్న్ ఎయిర్‌పోర్టులో వాటిని గుర్తించిన సిబ్బంది అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. అక్కడి అధికారులు ఆమెకు రూ. 1.14లక్షల జరిమానా వేశారు. ప్రపంచంలోని అత్యంత కఠినమైన బయోసెక్యూరిటీ- చట్టాలు ఉన్న విమానాశ్రయాల్లో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ ఎయిర్‌పోర్టు ఒకటి. ప్రయాణికులు పండ్లు, విత్తనాలు, పూలను తీసుకువెళ్లడం అక్కడ నిషిద్ధం. వాటివల్ల ప్రయాణికులకు వివిధ రకాల వ్యాధులు, తెగుళ్లు సులభంగా వ్యాపించే అవకాశం ఉండడంతో ఈ నిబంధన పెట్టారు.



నవ్య మెల్‌బోర్న్ విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం అక్కడి కస్టమ్స్ అధికారులు ఆమె బ్యాగ్‌లో మల్లెపూలును తీసుకువచ్చినందుకు జరిమానా విధించడంతో నటి లక్ష రూపాయలు చెల్లించింది. అనంతరం మెల్‌బోర్న్‌లో జరిగిన ఓనం కార్యక్రమంలో నటి నవ్య తనకు ఎదురైన అనుభవాన్ని చెప్పడంతో ఈ విషయం బయటకు వచ్చింది. తాను తీసుకువచ్చిన పూలు లక్ష రూపాయలు ఖరీదైనవని జరిమానా విధించేవరకు తనకు తెలియదని చమత్కరించింది.




# 'తెలుసు కదా' సినిమాపై రాశి ఖన్నా భావోద్వేగ పోస్ట్

### యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ, రాశి ఖన్నా కొత్త చిత్రం 'తెలుసు కదా'

### ఈ సినిమా జర్నీ తనకు ప్రత్యేకమన్న రాశి ఖన్నా

### అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు వస్తున్న చిత్రం

టాకీస్: యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా' షూటింగ్ చివరి అంకానికి చేరుకుంది. ఈ సినిమాలో నటిస్తున్న హీరోయిన్ రాశి ఖన్నా తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను తాజాగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా సినిమాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆమె సోషల్ మీడియాలో ఒక భావోద్వేగ పోస్ట్ పంచుకున్నారు. "కెమెరాలు ఆగి పోయిన తర్వాత కూడా కొన్ని కథలు గుర్తుండిపోతాయి. 'తెలుసు కదా' అలాంటి కథే. ఈ సినిమా ప్రయాణం నాకు ఎంతో ప్రత్యేకం. ఈ జర్నీలో నాతో ఉన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మేం సృష్టించిన ఈ ప్రపంచంలోకి మీరు అడుగు పెట్టే రోజు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను" అని రాశి ఖన్నా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆమె పోస్ట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన ఈ చిత్రం తో దర్శకురాలిగా పరిచయం అవుతుండటం విశేషం. సిద్ధు సరసన రాశి ఖన్నాతో పాటు శ్రీనిధి శెట్టి కూడా మరో కథానాయికగా నటిస్తున్నారు. రొమాంటిక్ డ్రామాగా తెర కెక్కుతున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే దాదాపు షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి. భావోద్వేగాలకు పెద్దపీట వేస్తూ రూపొందు తున్న ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు తీసుకురా నున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.




### వరుస ప్రాజెక్టులతో

# అమ్మడు బిజీ బిజీ..

### టాలీవుడ్‌లో చక్రం తిప్పుతున్న కుర్ర హీరోయిన్..

టాకీస్: ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో వరుస అవకాశాలు అందుకుంటూ ఫుల్ బిజీగా ఉంటుంది. ఒకవైపు తన కొత్త సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉంటూనే మరోవైపు కొత్త సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. తాజాగా ఈ అమ్మడు గ్లామర్ ఫోటోషూట్లతో సోషల్ మీడియాలో మెంటలెక్కిస్తుంది. ఇప్పుడు ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. యంగ్ అండ్ బ్యూటీఫుల్ హీరోయిన్ రితికా నాయక్.. ఇప్పుడు తెలుగులో వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఇప్పుడిప్పుడే వరుస అవకాశాలు అందుకుంటూ తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంటుంది. కెరీర్ మొదట్లో సినిమాల్లో చిన్న చిన్న పాత్రలలో నటించింది. ప్రస్తుతం ఈ అమ్మడు వయసు 27 సంవత్సరాలు. 1997 అక్టోబర్ 27న ఢిల్లీలో జన్మించిన ఈ బ్యూటీ అక్కడే విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకుంది. విమెన్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కాలేజీలో డిగ్రీ కంప్లీట్ చేసుకుంది. నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ.. 2019 నుంచి సినిమా ప్రపంచంలోకి ఎంట్రీ ఇచ్చింది. 2022లో విశ్వక్ సేన్ నటించిన అశోకవనంలో అర్జున కళ్యాణం చిత్రంలో సెకండ్ హీరోయిన్ గా నటించింది. ఇందులో తన నటనతో ఆకట్టుకుంది. నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ.. 2019 నుంచి సినిమా ప్రపంచంలోకి ఎంట్రీ ఇచ్చింది. 2022లో విశ్వక్ సేన్ నటించిన అశోకవనంలో అర్జున కళ్యాణం చిత్రంలో సెకండ్ హీరోయిన్ గా నటించింది. ఇందులో తన నటనతో ఆకట్టుకుంది. దీంతో ఇప్పుడు ఈ మూవీ ప్రమోషన్స్ జోరుగా నటిస్తున్నాయి. అలాగే ఆనంద్ దేవరకొండతో ఒక సినిమా.. వరుణ్ తేజ్ జోడిగా నటిస్తుంది. ఇవే కాకుండా తెలుగులో ఈ బ్యూటీకి మరిన్ని ఆఫర్స్ క్యూ కట్టినట్లు సమాచారం.

# తిరుమల కిషోర్ దర్శకత్వంలో రవితేజ చిత్రం

### ఆర్‌టీ 76 సినిమాకు అప్పడే ఓటీటీ రైట్స్

**టాకీస్:** బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్ లో పెడుతున్నాడు మాస్ మహారాజ. ప్రస్తుతం భాను భోగవరపు దర్శకత్వంలో చేస్తున్న 'మాస్ జాతర' సినిమాకు ఫినిషింగ్ టచ్ ఇస్తున్నాడు. ఈ సినిమా ఈ ఏడాది అక్టోబరు 31న రిలీజ్ కు రెడీ అవుతోంది. మాస్ జాతర సెట్స్ పై ఉండగానే తన నెక్ట్స్ సినిమా కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రవితేజ ఇప్పుడు ఆ సినిమా షూటింగ్ కు రెడీ అవుతున్నాడు. నేనుశైలజా, చిత్రలహరి వంటి సూపర్ హిట్ సినిమాలను డైరెక్ట్ చేసిన కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. రవితేజ కెరీర్ లో 76వ సినిమాగా వస్తున్న ఈ సినిమాలో రవితేజ ÷-టసైల్ కామెడీ, కిషోర్ టేకింగ్ లో ఉండే ఎమోషన్స్ తో కలగలిపి పర్ఫెక్ట్ యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ సినిమాగా రాబోతోంది. ఇదిలా ఉండగా ఈ సినిమా డిజిటల్ రైట్స్ డీల్ క్లోజ్ అయింది. ప్రముఖ ఓటీటీ- నిర్మాణ సంస్థ జీ5 రవితేజ - కిషోర్ తిరుమల సినిమా ఓటీటీ- రైట్స్ తో పాటు- శాటిలైట్ రైట్స్ ను కూడా కొనుగోలు చేసింది. ఇంకా - టైటిల్ కూడా అధికారకంగా ప్రకటించని సినిమా ఓటీటీ- రైట్స్ అమ్ముడయ్యాయి అంటే జాక్ పాట్ అనే చెప్పాలి. భీమ్స్ సిసిరోలియో




సంగీతం అందిస్తున్న ఈ సినిమా అక్టోబర్ నెలాఖరుకు మొత్తం వర్క్ కానుంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా రిలీజ్ కానున్నఈ సినిమాలో ఆషిక రంగనాథ్ హీరోయిన్ గా నటిస్తున్నఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్ తో సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారు.

# ఓజీ కోసం 117 మంది మ్యూజిషన్స్ కసరత్తు

### సంగీత దర్శకుడు తమన్ వెల్లడి




**టాకీస్:** పవన్ కల్యాణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ ఓజీ. సుజిత్ డైరెక్షన్‌లో పాన్ ఇండియా గ్యాంగ్ స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, ప్రకాశ్ రాజ్, శామ్, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఓజీతో బాలీవుడ్ యాక్టర్ ఇమ్రాన్ హష్మీ టాలీవుడ్ డెబ్యూ ఇస్తున్నాడు. ఈ మూవీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. కాగా థమన్ అదిరిపోయే అప్‌డేట్ అందించి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు. థమన్‌తోపాటు- 117 మంది మ్యుజిషియన్స్ ఓజీ కోసం లండన్‌లోని అబ్బే రోడ్ స్టూడియోలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ రికార్డింగ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని స్టూడియో ఫొటోను షేర్ చేస్తూ అందరితో పంచుకున్నాడు థమన్. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జెట్ స్పీడ్‌లో కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు విడుదల చేసిన రెండు పాటలను అభిమానులు ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. మరోవైపు థర్డ్ సింగిల్ గురించి ఎక్సయిటింగ్‌గా ఎదురు చూస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన అప్‌డేట్ రానుంది. కాగా తొలిసారి తెలుగు ప్రేక్షకులను పలుకరిస్తుండటం. డీవీవీ ఎంటర్-టైన్‌మెంట్స్‌పై డీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.